# ప్రజాశక్తి

ఆదివారం 16 జులై 2023 8 పేజీలు







ప్రకాశం బాపట్ల




వర్షానికి తడిసిన మిర్చి (ఫైల్)

## నష్టం బారెడు.. పరిహారం జానెడు..

- వర్షానికి దెబ్బతిన్న పంటలు
- అరకొరగా పరిహారం
- నష్టాల బాటలో రైతులు

**ప్రజాశక్తి-యర్రగొండపాలెం**

యర్రగొండపాలెం ప్రాంతంలో వ్యవసాయం తప్ప మరో ఉపాధి లేదు. ఇక్కడి రైతులు వ్యయ, ప్రయాసలకు ఓర్చి అందినకాడికి అప్పులు తెచ్చి పంటలు సాగు చేస్తుంటారు. చివరకూ పెట్టుబడి కూడా దక్కక నష్టాలే మూట గట్టుకుంటున్నారు. ఆదుకోవాల్సిన ప్రభుత్వం వారిని నట్టేట ముంచుతోంది. రాయితీలు, నష్టపరిహారం, బీమా అరకొరగా అందిస్తోంది. అనేక మందికి బీమా పథకం వర్తించక నష్టపోతున్నారు.

**మిర్చికి బీమా లేదాయె..**

ఉచిత బీమా పథకం పరిహాసంగా మారింది. యర్రగొండపాలెం, పుల్లల చెరువు, త్రిపురాంతకం, పెద్దారవీడు, పెద్ద దోర్నాల మండలాల్లో పత్తి, మిరప, కంది, జొన్న, మొక్కజొన్న, మినుము, బొప్పాయి, ఉద్యానవన పంటలను సాగు చేస్తున్నారు. వాతావరణ ఆధారిత బీమా అమలు చేస్తున్నా, ఈ ఏడాది మిర్చి రైతులకు నష్టపరిహారం దక్కలేదు. మిరప సాగు చేసిన తొలినాళ్లలో అధిక వర్షాలు, తెగుళ్ళు సోకడం, పంట చేతికొచ్చే సమయంలో కల్లాల్లో ఆరబోసిన మిర్చి తడిచి పోయింది. అయినప్పటికీ రైతులకు బీమా వర్తించలేదు. కంది, పత్తి పంటలకు మాత్రమే ఇచ్చారు. పత్తికి ఎకరానికి రూ.2,880, కందికి ఎకరాకు రూ.8 వేలు చొప్పున ఇచ్చారు.

**పంటలు సాగు ఇలా..**

గతేడాది పెద్దారవీడు మండలంలో 3,800 ఎకరాల్లో పత్తి, 3,500 ఎకరాల్లో కంది, 2,800 ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. పెద్దదోర్నాల మండలంలో 3,500 ఎకరాల్లో పత్తి, 4,200 ఎకరాల్లో కంది, 3,100 ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. పుల్లలచెరువు మండలంలో 3,500 ఎకరాల్లో పతి, 4,500 ఎకరాల్లో మిర్చి, 3,200 ఎకరాల్లో కంది, 2,000 ఎకరాల్లో వరి సాగు చేశారు. త్రిపురాంతకం మండలంలో 8,500 ఎకరాల్లో వరి, 4,200 ఎకరాల్లో


▶ 2లో


# నేడు జిల్లాలోకి లోకేష్ ప్రవేశం

- కొండపి నియోజకవర్గంలో యువగళం పాదయాత్ర
- స్వాగత ఏర్పాట్లు చేసిన ఎమ్మెల్యే స్వామి, యువనేత సత్య



**ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో**

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆదివారం సాయంత్రం జిల్లాలోకి ప్రవేశిస్తారు. భవిష్యత్‌కు గ్యారంటీ పేరుతో టిడిపి ఇస్తున్న హామీలను పథకాలుగా ప్రజల్లోకి తీసుకుపోయేందుకు.. రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై ధ్వజమెత్తుతూ నారా లోకేష్ యువగళం పాదయాత్ర చేపట్టిన సంగతి తెలిసిందే. నెల్లూరు జిల్లా కందుకూరు నియోజకవర్గంలో శనివారం సాయంత్రం ప్రవేశించారు. రాత్రికి లింగసముద్రం సమీపంలో బసచేసిన లోకేష్ ఆదివారం అదే నియోజకవర్గంలో పాదయాత్ర నిర్వహిస్తారు. పార్టీ నేతలు ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొంటారు. రాత్రికి కొండపి నియోజకవర్గం పొన్నలూరు మండలం మాలపాడు సమీపంలో ఏర్పాటు చేసిన శిబిరంలో బసచేస్తారు. ఇక్కడ కొండపి నియోజకవర్గ నేతలు ఘన స్వాగతం కలకనున్నారు. అందుకు తగిన ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్యే వీరాంజనేయస్వామి, నియోజకవర్గ కీలక నేత దామచర్ల సత్య ఇప్పటికే నియోజకవర్గంలో పర్యటించే రూటు, గ్రామాల్లో పాదయాత్ర విజయవంతానికి అవసరమైన ఏర్పాట్లు చేశారు.స్వాగతానికి అవసరమైన ఏర్పాట్లు చూశారు. బసచేసే ప్రాంతంలో అన్ని జాగత్తలు తీసుకుంటున్నారు. సమీప గ్రామాల నుంచి జనం, పార్టీ అభిమానులు చేరుకునేలా ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో రాళ్లపాడు నుంచి కనిగిరి వరకూ పాదయాత్ర సాగనుంది. శనివారం రాత్రికి రాళ్లపాడు ప్రాజెక్టు మీదుగా కందుకూరు నియోజకర్గం లోకి చేరుకుంటారు. ఇక్కడ నుంచి కొండపి నియోజకవర్గం పొన్నలూరు మండలం మీదుగా కనిగిరికి చేరుకుంటారు. ఈ మార్గంలో ఎక్కడెక్కడ బస చేస్తారో ఖరారు చేశారు.సభలు జరిగే ప్రాంతాలను ఎంపిక చేశారు. అక్కడకు చుట్టుపక్కల గ్రామాల నుంచి జనసమీకరణపై దృష్టిసారించారు. ముందస్తు ఎన్నికల ఊహాగానాల నేపథ్యంలో పర్యటనను కుదించారు. నియోజకవర్గంలో రెండు రోజులు మించి కొనసాగే అవకాశం లేదు. నెల్లూరు జిల్లాలో ఇప్పటికే నెలరోజులుగా తిరిగిన ఆయన జిల్లాకు వచ్చే సరికి వేగం పెంచాల్సి వచ్చింది. మండల కేంద్రాలు, ముఖ్యగ్రామాల్లో బహిరంగ సభలకు ప్లాన్ చేశారు. వలేటివారిపాలెం, పొన్నలూరు మండలం రామచంద్రాపురంలో సభలు జరుగుతాయి. కనిగిరిలో బహిరంగ సభకు టిడిపి ఇన్‌ఛార్జి డాక్కర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక లోకేష్ పర్యటనపై జిల్లా నేతలు దృష్టి సారించారు. పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్ధన్, ఎమ్మెల్యే గొట్టిపాటి, సీనియర్ నేత దివి శివరాం నియోజకవర్గ ఇన్‌ఛార్జులతో కలిసి శుక్రవారం రాళ్లపాడు ప్రాజెక్టు నుంచి కనిగిరి వరకూ పాదయాత్ర వెళ్లే రూటులో పర్యటించారు. స్థానిక నేతలతో ఏర్పాట్లు, సమీకరణ, ఇతర అంశాలపై చర్చించారు.ఇక స్థానికంగా ఉన్న సమస్యలను లోకేస్ దృష్టికి తీసుకు పోయేలా ఏర్పాట్లు చేశారు. వివిధ వర్గాల ప్రజల సమస్యలను కొన్ని ఎంపిక చేసి లోకేష్‌తో మాట్లాడించేందుకు నేతలు దృష్టిసారించారు.ఒక్కో ప్రాంతంలో ఒక్కో తరహా సమస్యను లోకేషన్ తన ప్రసంగంలో ప్రధానంగా ప్రస్తావించే అవకాశం ఉంది. కందుకూరు నియోజక వర్గాన్ని తిరిగి ప్రకాశం జిల్లాలో కలిపే ప్రకటనే కీలకంగా కనిపిస్తోంది. కొండపి, కనిగిరి నియోజకవర్గాల్లో తాగునీరు, సాగునీటి సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. ఫ్లోరిన్ పీడిత ప్రాంతాలుగా ఉన్నాయి. వెలుగొండ ప్రాజెక్టును ప్రస్తావిస్తారా?లేదా? అనేదీ చూడాలి. కరువు సీమగా ఉన్న కనిగిరికి ఏ హామీలు ఇస్తారో చూడాలి. లోకేష్ శనివారం రాత్రికే ఉమ్మడి ప్రకాశం జిల్లాలోకి ప్రవేశించారు. రాళ్లపాడు ప్రాజెక్టు వద్దే ఉమ్మడి ప్రకాశం జిల్లా నేతలు ఆయనకు ఘన స్వాగతం పలికారు.

## విద్యార్థులు లక్ష్యంతో చదవాలి

### కలెక్టర్ దినేష్ కుమార్

**ప్రజాశక్తి- శింగరాయకొండ**




ఆడిటోరియాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్

విద్యార్థులు ఓ లక్ష్యంతో చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందని జిల్లా కలెక్టర్ ఎఎస్.దినేష్ కుమార్ తెలిపారు. పాకల జిల్లాపరిషత్ హైస్కూల్ పూర్వవిద్యార్థుల అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వర్ణోత్సవ ఆడిటోరియం కలెక్టర్ దినేష్ కుమార్ చేతుల మీదుగా శనివారం ప్రారంభించారు. పూర్వ విద్యార్థుల అసోసియేషన్ ఆధ్వర్యంలో సుమారు రూ.60 లక్షల వ్యయంతో పాకల జిల్లా పరిషత్ హైస్కూల్‌ను అభివద్ధి చేశారు. సరస్వతి విగ్రహాన్ని పి.ఇందిరా, డయాస్‌ను డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, గ్రంథాలయాన్ని కేసవరపు పెద్దకోటిరెడ్డి, విశ్రాంత భవనాన్ని ఎన్ఆర్ఐ బుర్ల కోటిరెడ్డి కలెక్టర్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల అసోసియేషన్ ఆధ్వర్యంలో పాకల హైస్కూల్‌ను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దినట్లు తెలిపారు. అందుకు అనుగుణంగా విద్యార్థులు ఓ లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. ప్రభుత్వం కూడా ప్రభుత్వ పాఠశాలలను అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో దాతల సహకారం కూడా మరువలేనిదన్నారు. గ్రామీణ ప్రాంతంలో మంచి వాతావరణంలో ఉన్న పాఠశాలలో విద్యార్థులు బాగా చదివి అందరికీ ఆదర్శంగా నిలవాలన్నారు. అనంతరం


▶ 2లో






నిర్యాణము

మా తండ్రిగారైన
శ్రీ కౌతవరపు వెంకట్రావు (గిరి) గారు
ది.4-7-2023 మంగళవారం స్వర్గస్థులైనారు.
ది. 16-7-2023 ఆదివారం
పెద్దకర్మ
చీరాల, కొత్తపేట, వివేకానందనగర్‌కాలనీ,
KSR హ్యాండ్లూమ్స్‌నందు జరుగును.
మధ్యాహ్నం గం. 12-00 లకు "వైకుంఠ సమారాధన"
కావున తెలియపరచడమైనది.

ఇట్లు, కుమారుడు
కౌతవరపు శ్రీనివాసరావు
మరియు కుటుంబసభ్యులు,
చీరాల, (కొత్తపేట)

KSR HANDLOOMS PRIVATE LIMITED

## నష్టం బారెడు.. పరిహారం జానెడు..

(మొదటి పేజీ తరువాయి)

మిర్చి, 3,900 ఎకరాల్లో పత్తి, 3,500 ఎకరాల్లో కంది సాగు చేశారు. యర్రగొండపాలెం మండలంలో 4,200 ఎకరాల్లో మిర్చి, 3,900 ఎకరాల్లో పత్తి, 4,100 ఎకరాల్లో కంది, 250 ఎకరాల్లో వరి పంటలు సాగు చేశారు.

**అరకొరగా పరిహారం**

– పెద్దారవీడు మండలంలో 862 మంది రైతులు 521 ఎకరాలల్లో కంది పంట సాగు చేశారు. వారికి రూ. 1,53,58,599 నష్టపరిహారం అందజేశారు.

– పెద్దదోర్నాల మండలంలో 113 మంది రైతులు 82 ఎకరాల్లో కంది పంట సాగు చేశారు. వారికి రూ. 9,63,561 నష్ట పరిహారం అందజేశారు.

– పుల్లలచెరువు మండలం 4533 మంది రైతులు ఎకరాలల్లో పత్తి పంట సాగు చేశారు. వారికి రూ. 2,81,44,379, 240 మంది రైతులు 209 ఎకరాల్లో వరి పంట సాగు చేయగా వారికి రూ. 31,46,648 నష్టపరిహారం అందజేశారు.

– త్రిపురాంతకం మండలంలో 144 మంది రైతులు 203 ఎకరాల్లో పత్తి పంట సాగు చేశారు. వారికి రూ. 5,59,204, 800 మంది రైతులు 582 ఎకరాల్లో కంది పంట సాగు చేయగా వారికి రూ. 68,64,118 నష్టపరిహారం అందజేశారు.

–. యర్రగొండపాలెం మండలంలో 3,451 మంది రైతులు 7,045 ఎకరాల్లో పత్తి పంట సాగు చేశారు. వారికి రూ. 1,18,35,883 పంట నష్టపరిహారం అందజేశారు.

**మిర్చి సాగు చేసి లక్షల్లో నష్టం**

**కైపు బ్రహ్మారెడ్డి, రైతు, మురారిపల్లి**



మిర్చి ఐదు ఎకరాలు సాగుచేశా. దిగుబడి ఎకరాకు రెండు క్వింటాళ్ల మాత్రమే వచ్చింది. కూలీ, ఎరువులు, పురుగు మందుల ధరలు అమాంతంగా పెరగటంతో పెట్టుబడి సైతం రాలేదు. పత్తి మూడెకరాల్లో సాగుచేస్తే మూడు క్వింటాళ్ల మాత్రమే దిగుబడి వచ్చింది. రైతు భరోసా కేంద్రంలో ఎకరాకు నష్టం వాటిల్లినట్లు లెక్కలు రాసుకొని రూ.2,880 మాత్రమే ఇచ్చారు.

**ఒక్క రూపాయీ ఇవ్వలేదు**

**జినుకూటి రాజీవ్ గాంధీ, రైతు, నాయుడుపాలెం**



ప్రకతి వైపరీత్యాలతో గతేడాది ఖరీఫ్ పంట పూర్తిగా దెబ్బతింది. ఐదెకరాల్లో పత్తి సాగుచేస్తే అధిక వర్షాలతో ఎకరాకు మూడు క్వింటాళ్ల మాత్రమే దిగుబడి వచ్చింది. మిర్చి అధిక వర్షాల కారణంగా పూర్తి దెబ్బతింది. అప్పులు చేసి రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టా. ఒక్క రూపాయి కూడా పరిహారం రాలేదు.

## సచివాలయాల్లో తనిఖీ

**ప్రజాశక్తి- ఒంగోలు అర్బన్**

నగరంలోని కేశవరాజు పేట, గాంధీరోడ్డు, దారావారితోట, దేవుని చెరువు సచివాలయాలను కమిషనర్ ఎం. వెంకటేశ్వరరావు శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయా సచివాలయాల్లో పలువురు సిబ్బంది ఏకరూప దుస్తులు ధరించనందున వారికి ఛార్జి మెమోలు ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం సిబ్బంది హాజరు రిజిస్టర్, మూమెంట్ రిజిస్టర్‌లను పరిశీలించారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న డోర్‌టుడోర్ సర్వే పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు.

## ఫ్లోరిన్ బాధితులకు పరామర్శ

**ప్రజాశక్తి-పొదిలి**

మండల పరిధిలోని రాజుపాలెం గ్రామంలో ఫ్లోరోసిస్ బాధితులను రాష్ట్ర ఫ్లోరిన్ కంట్రోల్ అధికారి డాక్టర్ ప్రశాంత్, జిల్లా అధికారి డాక్టర్ భగీరథ దేవి, డాక్టర్ అనిల్ కుమార్ శనివారం పరామర్శించారు. ఫ్లోరోసిస్ బాధితుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ శ్రీనివాసరెడ్డి, ఎఎన్‌ఎం మాధవి, ఆశా వర్కరు శ్యామల పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ విక్రయ దుకాణాలపై దాడులు

**ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్**

నగరంలోని బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్, గాంధీరోడ్డు దక్షిణ బంజారులోని పలు ప్లాస్టిక్ విక్రయ దుకాణాలపై కార్పొరేషన్ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 120 మైక్రాన్‌ల కంటే తక్కువగా ఉన్న ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులను సీజ్ చేసి కార్పొరేషన్ కార్యాల యానికి తరలించారు. షాపుల యజమానులకు సుమారు రూ.12వేల పెనాల్టీ విధించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్ విక్రయాలు చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈదాడుల్లో హెల్త్ ఆఫీసర్ మనోహర్‌రెడ్డి, శానిటరీ సూపర్ వైజర్ ఎన్ పిచ్చయ్య, ఇన్‌స్పెక్టర్ శ్రీను పాల్గొన్నారు.

**పందులను ఊరికి దూరంగా తరలించాలి: కమిషనర్**

జనావాసాల మధ్య పందులు సంచరిస్తే వాటి పెంపకం దారులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని కమిషనర్ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. కమిషనర్ శనివారం విలేకర్లతో మాట్లాడారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో జనావాసాల మధ్య పందులు సంచరిస్తే మొదడు వాపు వ్యాధితోపాటు పలు రకాల వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. పందులను జనావాసాల మధ్య నుంచి ఊరికి దూరంగా తరలించాలని వాటి యజమానులకు సూచించారు. లేని పక్షంలో తామే పందులను అదుపులోకి తీసుకొని అడవుల్లో వదిలేస్తామని చెప్పారు.



ప్లాస్టిక్ విక్రయ దుకాణంలో పరిశీలిస్తున్న కమిషనర్

## మంత్రి సురేష్‌కు వినతి

**ప్రజాశక్తి-పొదిలి**

విద్యుత్ షాక్‌తో తన భర్త మృతి చెందినా అధికారులు స్పందించడం లేదంటూ మంత్రి సురేష్‌కు బాధితురాలు శనివారం ఫిర్యాదు చేసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కంబాలపాడు గ్రామ సచివాలయ పరిధిలో విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ షాక్‌తో తన అలవల వెంకటనారాయణ మృతిచెందినట్లు తెలిపింది. తన కుటుంబానికి న్యాయం చేయాలని కోరింది. ఈ సందర్భంగా మంత్రి ఆదిమూలపు సురేష్ స్పందిస్తూ తక్షణం కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని ఎస్ఐను ఆదేశించారు. అనంతరం విద్యుత్ శాఖ ఎస్ఇతో ఫోన్లో మాట్లాడారు. ప్రమాదం జరిగి మరణించిన స్పందించరా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణం పొదిలికి వచ్చిన మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి తగిన న్యాయం చేయాలని మంత్రి ఎస్ఇని ఆదేశించారు.

# అంతర్రాష్ట్ర గంజాయి ముఠా ఆటకట్టు

**ప్రజాశక్తి-బాపట్ల జిల్లా**

జిల్లాలో ఎవరైనా గంజాయి కలిగి వున్న సేవించిన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌పి వకుల్ జిందాల్ హెచ్చరించారు. శనివారం క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి వేటపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి కేసులోని నిందితుల అరెస్ట్, సీజ్ చేసిన గంజాయి గురించిన వివరాలను వెల్లడించారు.

బాపట్ల జిల్లా పోలీసులు ఐక్యంగా పనిచేసి నిఘా వ్యవస్థ ద్వారా గత కొంతకాలంగా చాప కింద నీరు లాగా విస్తరించిన అతిపెద్ద గంజాయి నెట్వర్క్‌ను ఛేదించి వారిని అరెస్ట్ చేశారని తెలిపారు. ఈ కేసులో 26 మందిని అరెస్టు చేసి రూ.6 లక్షల విలువ కలిగిన 55 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గంజాయి రవాణాకు ఉపయోగించిన ఇన్నోవా కారును సీజ్ చేశామన్నారు. ఈ కేసులో చీరాల డిఎస్పి ప్రసాదరావు, చీరాల రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున్ రావు, వేటపాలెం ఎస్ఐ సురేష్, పోలీస్ సిబ్బంది అత్యంత చాకచక్యంగా వ్యవహరించి ముద్దాయిలను అరెస్టు చేశామని, ఇది జిల్లాలోనే అతిపెద్ద నెట్వర్క్ ఉన్న గంజాయి ముఠా అని తెలిపారు. ఇంత పెద్ద కేసుని ఛేదించిన వారిని అభినందించి సర్టిఫికెట్లతో సత్కరించినట్లు తెలిపారు. గంజాయి ఎవరి ద్వారా చేతులు మారుతుంది అనే విషయాలను జిల్లా ఎస్పీ మీడియాకు తెలిపారు. మొదటగా ఒరిస్సా ప్రాంతంలో పండిన గంజాయిని అటవీ ప్రాంతం ద్వారా ఆదివాసుల సహాయంతో రాష్ట్రంలో ఉన్న సరిహద్దులో వున్న అల్లూరి సీతారామరాజు జిల్లాకు బాలాజీ గోవింద్ అనే వ్యక్తి పెద్ద మొత్తంలో తెప్పించుకుంటున్నాడని, సింహాచలం అనే వ్యక్తి ద్వారా అనకాపల్లి జిల్లాకు చెందిన రాజా దుర్గాప్రసాద్, కైసర్లి స్వామి అనే వ్యక్తులకు అమ్ముతున్నారని, సదరు దుర్గాప్రసాద్‌కు బంధువైన బాపట్ల జిల్లాలోని మార్టూరు మండల నివాసి అయి బిల్లా ప్రకాష్‌కు అమ్ముతున్నట్లు, బిళ్లా ప్రకాష్ బాపట్ల జిల్లాలో, ప్రకాశం జిల్లాలోని కొన్ని మండలాల్లో ఎవరైతే కొద్దీ మొత్తంలో గంజాయి అమ్మేవారు ఉన్నారో వారిని గుర్తించి వారితో ఒక ముఠాగా ఏర్పడి దుర్గాప్రసాద్ ద్వారా ఎక్కువ మొత్తంలో కొన్న గంజాయిని మార్టూరు మండలంలో ఉన్న గోపనబోయిన కృష్ణవంశీకి, కృష్ణవంశీ ద్వారా ఇంకొల్లులో నివాసముండే బీహార్‌కు చెందిన బిషుదాస్ ప్రసాద్, సుధీర్ రాజేంద్రప్రసాద్‌లకు అమ్ముతున్నాడని తెలిపారు. బిళ్లా ప్రకాష్ అద్దంకి పట్టణంలోని దేవరకొండ హరీష్‌కు, జరుగుమల్లి మండలంలోని పూరి మెట్ల ఆనందుకు, మార్టూరు గ్రామంలోని జనరాజుపల్లి తిరుమలకు, ఒంగోలు పట్టణంలోని గట్నికి వినయ్ కుమార్‌కు, అన్నమయ్య జిల్లాలోని బచ్చిరెడ్డి సుధీర్ కుమార్‌కు, స్టూవర్టుపురం ప్రాంతంలోని పేరిగ కళ్యాణికి, కళ్యాణి ద్వారా బోయినవారిపాలెం గ్రామంలోని పీరిగ రోజాకు పంపిస్తున్నారన్నారు. వీరందరూ పెద్ద ముఠాగా ఏర్పడి ఎవరికీ అనుమానం రాకుండా అనేకమంది గంజాయి సేవించే వారికి కొద్ది మొత్తంలో అమ్ముతున్నారని చెప్పారు. ఇకనుంచి గంజాయి సేవించే వారిని కూడా అరెస్టు చేస్తామని, వారిలో మార్పు రాకపోతే షీట్లు కూడా తెరవడానికి వెనుకాడబోమని అన్నారు. యువత దీన్ని దృష్టిలో పెట్టుకొని తమ విలువైన జీవితాన్ని స్వల్పకాల ఆనందాల కోసం తాకట్టు పెట్టవద్దని ఎస్‌పి తెలిపారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎస్‌పి వకుల్ జిందాల్

## విద్యార్థులు లక్ష్యంతో చదవాలి

(మొదటిపేజీ తరువాయి)

పాఠశాల పూర్వ విద్యార్థుల అసోసియేషన్ సభ్యులు డాక్టర్ బి.హరిబాబు, బక్కముంతల వెంకటేశ్వర్లు, సిహెచ్. వెంకట్రావు, బివి.కష్ణారెడ్డి, ఉల్చి సుబ్బారెడ్డి, కొల్లూరు వెంకయ్య, బుర్ల సుధాకర్‌రెడ్డి, సుధీర్‌బాబు, పాఠశాల ప్రధానోపా ధ్యాయుడు డివిఎస్.ప్రసాద్ మాట్లాడారు.

**సచివాలయాల సందర్శన**

జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్, వైసిపి విద్యార్థి విభాగం అధ్యక్షుడు దామతోటి శ్రీనివాసరావు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. దీంతో కలెక్టర్ పాకల 1,2 సచివాలయాలను సందర్శించి సిబ్బందితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక సమస్యలను తక్షణం పరిష్కరించి ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. సచివాలయంలో కాగితాలు లేవని చెప్పడం సరికాదన్నారు. అనంతరం సముద్ర తీరాన్ని సందర్శించారు. ఏపీ టూరిజం ఆధ్వర్యంలో పాకల బాగా అభివద్ధి చెందబోతుందని తెలిపారు. ప్రభుత్వం పాకల సముద్ర తీరాన్ని అభివద్ధి చేసేందుకు కోట్ల రూపాయలు వెచ్చించబోతుందని వివరించారు. అనంతరం జగనన్న కాలనీని సందర్శించి అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గహ నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు సిహెచ్.ఉష, ఎంపిడిఒ షేక్ జమీఉల్లా, ఎంఇఒ బి.శివన్నారాయణ, ఏపీ టూరిజం డిప్యూటీ కలెక్టర్ వాకా శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు

## నారాయణ స్వామి కుటుంబానికి న్యాయం చేయాలి

**యుఇఇయు రీజియన్ ప్రెసిడెంట్ జివి రాగయ్య**

**ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్**

విద్యుత్ ప్రమాదంలో చనిపోయిన ఆలవల నారాయణ స్వామి కుటుంబానికి విద్యుత్ యాజమాన్యం న్యాయం చేయాలని, కుటుంబంలో ఒకరికి రెగ్యులర్ ఉద్యోగం కల్పించి నష్టపరిహారం చెల్లించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రీజియన్ ప్రెసిడెంట్ జివి రాగయ్య డిమాండ్ చేశారు. పొదిలి నగర పంచాయతీ పరిధిలోని కంభాలపాడు జూనియర్ లైన్‌మెన్ ఎనర్జీ అసిస్టెంట్ అలవల నారాయణస్వామి(30) విద్యుత్ షాక్‌కు గురై మతి చెందారు. మృతునికి భార్య, రెండేళ్ళ కుమారుడు ఉన్నారు. ఈ సందర్భంగా జివి రాగయ్య మాట్లాడుతూ ప్రమాదానికి సంబంధించిన కారణాలు వాస్తవ కోణంలో పరిశీలించి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

**ప్రజాశక్తి-భట్టిప్రోలు**

ప్రయాణంలో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని భట్టిప్రోలు ఎస్ఐ అంబటి చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని వెల్లటూరు ప్రధాన కూడలిలో ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిమితికి మించి ఆటోలో ప్రయాణికులను ఎక్కిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రతి ఒక్కరూ నిబంధనల ప్రకారం లైసెన్సులు కలిగి ఉండాలన్నారు.

**మహారాజశ్రీ పొదిలి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో**

**ఓ.ఎస్.నెం:332/2022**

తాళ్లూరి వెంకటరామయ్య ... వాది

వర్సెస్

ఈపూరి శ్రీను ... ప్రతివాది

టు,
ఈపూరి శ్రీను, తండ్రి సుబ్బారావు,
అయ్యగానిపల్లె గ్రామం, పుల్లలచెరువు మండలం,
ప్రకాశం జిల్లా. అనువారికి,

పై నంబరు దావాలో పరిహారం నిమిత్తం, వాది నీ మీద దావా దాఖలు చేసినందున నీ హాజరు నిమిత్తం పై కోర్టు వారు నీకు నోటీసులు పంపించిననూ జారీ కానందున శ్రీ కోర్టు వారు నీ నోటీసు నిమిత్తం వాయిదా తేదీ: 24-07-2023ది అయిఉన్నది. కావున పై తేదీన ఉదయం 10:30 గంటలకు నీవు స్వయంగా గాని, ప్లీడర్ గారి ద్వారా కానీ శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై నీ ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో మీ పరోక్షమున తీర్మానించ బడునని ఇందుమూలముగా తెలియపరచడమైనది.

**(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)**

**వాయిదా తేదీ: 24-07-2023**

**పొదిలి**
**తేది:15-07-2023** ఇట్లు

**ఎం.వి.రమణ కిషోరు,**
బి.కామ్, ఎల్.ఎల్.బి.
అడ్వకేట్ మరియు నోటరీ,
పొదిలి, ప్రకాశం జిల్లా,
సెల్ :9948139224.

# అర్హులకు వరం.. జగనన్న సురక్ష

**ప్రజాశక్తి-నిజాంపట్నం**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన జగనన్న సురక్ష కార్యక్రమం అర్హులకు వరం లాంటిదని వైసీపీ నాయకులు మోపిదేవి హరనాథ్‌బాబు అన్నారు. శనివారం మండలంలోని అడవులదీవి, కొత్తపాలెం సచివాలయాల్లో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ముఖ్య అతిథిగా అయన పాల్గొని లబ్ధిదారులకు పలు రకాల ధృవపత్రాలను ఉచితంగా అందజేశారు. అనంతరం అయన మాట్లాడుతూ సాంకేతిక, ఇతరత్రా కారణాల వల్ల ఏ ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరం కాకూడదన్న లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారని చెప్పారు. అర్హత ఉన్నా వివిధ కారణాలతో సంక్షేమ పథకాలు అందని వారిని అధికారులు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు గుర్తించి వారికి కూడా జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులకు ధవ పత్రాలను అందజేసి సంక్షేమ పథకాలు పొందేలా చేస్తారని చెప్పారు. జగనన్న సురక్ష కార్యక్రమం నెల రోజుల పాటు జరుగుతుందని, ఈ కార్యక్రమంలో మొత్తం 11 రకాల సేవలను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులందరూ సద్వినియోగం చేసుకొని నూరు శాతం సంక్షేమ లబ్ధి పొందాలని అయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల సచివాలయాల కన్వీనర్ నాజర్‌ఖాన్, తహశీల్దార్ నెహ్రూబాబు, ఎంపీడీవో ఎన్ నాగలక్ష్మి, స్పెషల్ ఆఫీసర్ డి చంద్రశేఖర్, ఈఓపీఆర్డీ సునీత, సర్పంచులు శొంఠి శ్రీనివాసరావు, కె రవి, ఎంపీటీసీలు ఎల్ఎస్ఆర్, గోపాలకృష్ణ, రామాని కోటేశ్వరరావు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మోపిదేవి హరనాథ్‌బాబు



కారంచేడులో సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

**కారంచేడు:** ప్రజలకు పారదర్శకంగా వివిధ రకాల సేవలు అందించడమే జగనన్న సురక్ష కార్యక్రమం ఉద్దేశమని కారంచేడు అధికారులు అన్నారు. బాపట్ల జిల్లా కారంచేడు మండలంలో శనివారం నాడు కారంచేడు సచివాలయం-1, దగ్గుబాడు గ్రామ సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కారంచేడులో 872 వివిధ రకాల సర్టిఫికెట్లు పంపిణీ చేయగా, దగ్గుబాడు గ్రామపంచాయతీలో జరిగిన కార్యక్రమంలో 2,313 సర్టిఫికెట్లు పంపిణీ చేసి బాపట్ల జిల్లాలోనే మూడో స్థానంగా నిలిచారు. గత వారం రోజులుగా జరిగిన డోర్ టు డోర్ సర్వేలో వివిధ సర్వీసులకు సంబంధించి ఫిర్యాదులు స్వీకరించి వారికి సంబంధించిన సర్టిఫికెట్లను శనివారం జారీ చేసినట్లు ఆయా పంచాయతీల కార్యదర్శులు అంజయ్య, కట్టా జోత్స్న తెలిపారు. గత వారం రోజులుగా వాలంటీర్లు సచివాలయ సిబ్బంది ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులను కలిసి వారికి కావలసిన అర్జీలను తీసుకొని ఈ సర్వీసులను అందించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో దగ్గుబాడు పంచాయతీలో తహశీల్దారు ఎస్ వెంకటరత్నం, ఇఓఆర్డి రమేష్‌బాబు, జగనన్న సురక్ష ప్రత్యేక అధికారి రామకృష్ణ పాల్గొనగా కారంచేడు సచివాలయం-1లో ఎంపీడీవో విజయలక్ష్మి, మండల ప్రత్యేక అధికారి రామారావు, వైస్ ఎంపీపీ యార్లగడ్డ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.




బియ్యం కౌంటర్‌ను ప్రారంభిస్తున్న జెసి

## ప్రత్యేక బియ్యం కౌంటర్ ఏర్పాటు

**ప్రజాశక్తి-బాపట్ల**

బాపట్లలో ప్రత్యేక బియ్యం కౌంటర్‌ను జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీధర్ శనివారం ప్రారంభించారు. బాపట్ల రైల్వే స్టేషన్ ఎదురు బాపట్ల రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాల్లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బహిరంగ మార్కెట్లో అమ్మే బియ్యం ధరల కంటే తక్కువగా కేజీ రూ.60 అమ్మే సూపర్ ఫైన్ బియ్యాన్ని రూ.48కి, రూ.55లకు అమ్మే బియ్యాన్ని రూ.44కు, రూ.40కి అమ్మే బియ్యం రూ.34కు అమ్మే విధంగా సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ స్థానిక రైస్ మిల్లర్స్ సహకారంతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లయ్స్ అధికారి విలియమ్స్, డిప్యూటీ తహశీల్దారు ఓంకార్, బాపట్ల జిల్లా రైస్ మిల్లర్స్ అధ్యక్షులు బివి రత్నగుప్తా, ప్రధాన కార్యదర్శి రావి శ్రీనివాసరావు, కోశాధికారి ఎన్ హనుమంతరావు, ఉపాధ్యక్షులు ఎన్ నరసింహారావు, తటపర్తి గురుబ్రహ్మం, లీగల్ అడ్వైజర్ తటపర్తి శిరీష, సభ్యులు పబ్బిశెట్టి వెంకట రంగారావు, జివివి ఆంజనేయులు, సిహెచ్ సుధాకర్, వి వెంకటేశ్వర్లు, కెవిఎస్ ప్రసాద్, బి ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

## ఆక్రమణల తొలగింపునకు చర్యలు: తహశీల్దారు

**ప్రజాశక్తి-పర్చూరు**

ప్రభుత్వ శాఖలు కలిసి పని చేయటం ద్వారా పర్చూరు ప్రధాన రహదారులకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగించవచ్చని తహశీల్దారు కె సంధ్యశ్రీ తెలిపారు. పర్చూరు పంచాయతీ కార్యదర్శి ఆర్అండ్‌బి డిఇఇ, జాతీయ రహదారుల సంస్థల ఏఇలకు ఈ మేరకు లేఖలు పంపారు. ప్రధాన రహదారిలో ఆక్రమణలు ఉంటే వాటిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకొని వాటిని తొలగించాలని, 2022 సెప్టెంబరు 14న హైకోర్టు తీర్పు చెప్పిందని, అందువల్ల 6 నెలలు గడువు విధించినట్లు లేఖలో పేర్కొన్నారన్నారు. కోర్టు విధించిన తీర్పు గడువు దాటిపోయిందని, వివిధ కారణాలు, శాఖల మధ్య సమన్వయం లేకపోవటం వల్ల కోర్టు తీర్పును గడువు లోపు అమలు చేయని విషయాన్ని గుర్తు చేశారు. ఆక్రమణలు తొలగించేందుకు అన్ని శాఖలు కలిసి ఒక తేదీని నిర్ణయించాలని, దాని ప్రకారం శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా 144 సెక్షన్ విధించి తగు చర్యలు తీసుకుంటామని అన్నారు. హైకోర్టు ఆదేశాలు అమలు చేయకపోవటంతో కోర్టు ధిక్కరణ వ్యాజ్యం దాఖలైంది. దీనిపై రహదారులు, భవనాల శాఖ ప్రధాన కార్యదర్శి, జాతీయ రహదారులు, ఆర్అండ్‌బి ఉన్నతాధికారులతో పాటు జిల్లా కలెక్టర్ పంచాయతీ కార్యదర్శి, ఎస్‌హెచ్‌ఓ, తహశీల్దార్లు కౌంటర్ దాఖలు చేసేందుకు ఆగస్టు 10 వరకు హైకోర్టు గడువు ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఆక్రమణలు తీసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

## గ్రామాల అభివృద్ధికి తోడ్పాటు అందించాలి: ఎంపీపీ

**ప్రజాశక్తి-రేపల్లె:** మండలంలోని అన్ని గ్రామాల అభివద్ధికి తోడ్పాటు అందించాలని ఎంపీపీ సుశీల అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు తమ శాఖల పరిధిలోని అభివృద్ధి పథకాలపై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎండిఓ శివ పార్వతి మాట్లాడుతూ అధికారులు గ్రామాల్లో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. తహసీల్దార్ మల్లిఖార్జునరావు మాట్లాడుతూ అధికారులు అందరూ సమావేశంలో అందరూ అధికారులు హాజరై సమస్యలు పరిష్కారంకు కృషి చేయాలని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

# న్యాయ విజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలి: జడ్జి

**ప్రజాశక్తి-పంగులూరు**

విద్యార్థులు చక్కగా చదువుకొని, న్యాయవ్యవస్థ పట్ల అవగాహన పెంచుకోవాలని, అద్దంకి సీనియర్ సివిల్ జడ్జి బి బాబు నాయక్ కోరారు. శనివారం సాయంత్రం ముప్పవరం గ్రామంలోని బిసి బాలికల వసతి గృహంలో, మండల న్యాయ సేవా సంస్థ అద్దంకి వారి ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి బాబు నాయక్ మాట్లాడుతూ, విద్యార్థులు చక్కగా చదువుకొని మంచి ఉద్యోగాలు సంపాదించాలని ఆకాంక్షించారు. న్యాయవ్యవస్థ పట్ల కూడా అవగాహన పెంచుకోవాలని అన్నారు. తల్లిదండ్రులకు న్యాయ వ్యవస్థ గురించి వివరించి వారిలో మార్పు తీసుకురావాలన్నారు. సమాజంలో అట్టడుగున ఉన్న ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనార్టీలు, పేదలు, మహిళలు, ఎక్కడైనా అన్యాయం జరిగితే న్యాయసేవాధికార సంస్థను ఆశ్రయించి న్యాయం పొందవచ్చని అన్నారు. ప్రతి వ్యక్తికి కొన్ని ప్రాథమిక హక్కులు ఉంటాయని, ఆ హక్కులను హరించే హక్కు ఎవరికీ లేదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అద్దంకి బార్ అసోసియేషన్ అధ్యక్షులు చంద్రశేఖర అధ్యక్షత వహించగా, ఏపీపీ ఎస్ కుసుమలత, ఏజిపి వై రమేష్ బాబు, హాస్టల్ వార్డెన్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.




న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి

## ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

**ప్రజాశక్తి-మార్టూరు రూరల్**



నాగేశ్వరరావు (ఫైల్)

అనారోగ్య కారణాలతో వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని బొల్లాపల్లి గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. మార్టూరు ఎస్ఐ కోడూరి కమలాకర్ కథనం ప్రకారం.. బొల్లాపల్లి ఎస్సీ కాలనీకి చెందిన సందెపాము నాగేశ్వరరావు స్థానికంగా డాన్స్ క్లాసులు నిర్వహిస్తూ.. డాన్స్ మాస్టర్ రవిగా గుర్తింపు పొందాడు. ఈ క్రమంలో శుక్రవారం అర్ధరాత్రి తర్వాత తీవ్రమైన కడుపు నొప్పి రావడంతో తట్టుకోలేక తన ఇంట్లోనే చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కొద్దిసేపటికి గమనించిన భార్య సమీప బంధువులను అప్రమత్తం చేసి మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. స్థానిక పోలీస్ స్టేషన్లో సమాచారం ఇవ్వడంతో ఏఎస్ఐ బాషా కేసు నమోదు చేసి మృతదేహానికి శనివారం పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

## గుండెపోటుతో ఆర్‌టిసి కండక్టర్ మృతి

**ప్రజాశక్తి-యర్రగొండపాలెం**



అల్లూరి మోహన్ (ఫైల్)

విధులు నిర్వహిస్తూ ఆర్టీసీ కండక్టర్ గుండెపోటుతో మృతి చెందిన సంఘటన యర్రగొండపాలెంలో శనివారం జరిగింది. వేల్పుల అల్లూరి మోహన్ ఆర్టీసీ కండక్టర్‌గా మార్కాపురం డిపోలో విధులు నిర్వహిస్తున్నారు. రోజులాగే మార్కాపురం నుంచి యర్రగొండ పాలెం వెళ్లే బస్సుకు కండక్టర్‌గా విధులకు హాజరయ్యారు. విధులు నిర్వహిస్తున్న క్రమంలో యర్రగొండపాలెం చేరుకుని తిరిగి మార్కాపురం వెళ్లే సమయంలో అకస్మాత్తుగా గుండెపోటుకు గురై మృతి చెందారు.

## నాటు సారా తయారీ స్థావరంపై దాడి

**ప్రజాశక్తి-నిజాంపట్నం**

నాటు సారా తయారీ స్థావరంపై దాడి చేశామని నగరం సెబ్ సీఐ దేవర శ్రీనివాస్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని అడవులదీవి పంచాయతీ పరిధిలోని చంద్రమౌళినగర్ గ్రామ చివరిలోని మడ అడవుల వద్ద అండ్రాజు వెంకటేశ్వరరావు అనే వ్యక్తి నాటు సారా తయారు చేస్తుండగా దాడి చేసి అతని వద్ద నుంచి 5 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. దాంతో పాటుగా నాటుసారా తయారీకి ఉపయోగించే సామగ్రిని, 100 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామని చెప్పారు. అతనిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు సీఐ తెలిపారు.




మాట్లాడుతున్న సిఐ నజీర్‌బేగ్

## హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం: సిఐ

**ప్రజాశక్తి-రేపల్లె**

హెల్మెట్లు లేకుండా ప్రయాణాలు చేసే వాహన చోదకులపై చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ నజీర్ బేగ్ అన్నారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. హెల్మెట్ రహిత ప్రయాణం ప్రమాదకరమని, ప్రయాణ సమయంలో వాహన చోదకులు విధిగా హెల్మెట్లను ధరించాలని సూచించారు. గతంలో హెల్మెట్ లేకుండా ప్రయాణాలు చేసిన వారు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు అనేకం ఉన్నాయని అన్నారు. హెల్మెట్ ధరించి ఉంటే ప్రమాద సమయంలో ప్రాణాపాయ స్థితి ఉండదని చెప్పారు. ప్రయాణాల సమయంలో వాహన చోదకులు తమ వాహనానికి సంబంధించిన అన్ని కాగితాలను, డ్రైవింగ్ లైసెన్స్‌లను అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు.



విద్యార్థికి అభినందనలు తెలియజేస్తున్న ప్రిన్సిపాల్ వి మోహన్‌రావు

## అద్దంకి విద్యార్థికి పీజీ సెట్‌లో ర్యాంకు

**ప్రజాశక్తి-అద్దంకి**

సింగరకొండ కట్ట రామ కోటేశ్వరరావు డిగ్రీ కళాశాలలో డిగ్రీ చదువుతున్న బీఎస్సీ, బిజెడ్‌సి విద్యార్థి జలగల సుమంత్‌కి వృక్ష శాస్త్ర విభాగంలో ఆంధ్రప్రదేశ్ పిజి సెట్ 2023లో రాష్ట్రస్థాయి 12వ ర్యాంకు సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వేల్పుల మోహన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థి విజయానికి కారణమైన వృక్ష శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ ఎన్‌వి రమణ, డాక్టర్ బి రాజశేఖర్‌లను ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ప్రతి సంవత్సరం ఏపీ పిజిసిఈటిలో కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించడంపై ఆనందాన్ని వ్యక్తం చేశారు.




విద్యార్థిని అనూషను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

## నవోదయకు భీమవరం విద్యార్థిని ఎంపిక

**ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్**

జవహర్ నవోదయ పాఠశాలలో ఇంకొల్లు మండలం భీమవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (సిఇ)లో 5వ తరగతి విద్యార్థిని ఎన్ అనూష సీటు సాధించింది. ఈ సందర్భంగా అనూషను, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం రాంబాబును మండల విద్యాశాఖాధికారి పివి రాఘవులు, ఎ అనంతశ్రీనివాసరావు, ఇంకొల్లు ఉర్దూ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి హరేరామిరెడ్డి అభినందించారు.

## వేటపాలెం ఎంపీడీఓగా నేతాజీ

**ప్రజాశక్తి-వేటపాలెం**



చీరాల ఎంపీడీవోగా పనిచేస్తున్న కే నేతాజీ శనివారం వేటపాలెం మండల ఎంపీడీవోగా అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్నా తనకు నేరుగా ఫోన్‌చేసి వెల్లడించొచ్చని చెప్పారు. స్థానిక శాసనసభ్యులు కరణం బలరామకృష్ణమూర్తి, వైసిపి చీరాల నియోజకవర్గ ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్ సహకారంతో మండలాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా క్షేత్రస్థాయి అధికారులతో సమన్వయం చేసుకుంటానన్నారు. ఇప్పటివరకు ఇన్‌ఛార్జిగా కొనసాగిన మండల పరిషత్ సూపరింటెండెంట్ ఎంవిఎస్ శర్మను విధుల నుంచి హఠాత్తుగా తొలగించటం ఉద్యోగ వర్గాలలో కలకలం రేపింది. ఎంవిఎస్ శర్మ సూపరింటెండెంట్‌గా కొనసాగుతారా లేదా దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిపోతారా అనేది ఉద్యోగులలో చర్చనీయాంశంగా మారింది.

## చెరుకుపల్లి ఎస్ఐగా సురేష్

**ప్రజాశక్తి-చెరుకుపల్లి**



చెరుకుపల్లి ఎస్ఐగా వై సురేష్ బాధ్యతలు స్వీకరించారు. ఈయన ప్రస్తుతం రేపల్లె పట్టణ ఎస్ఐగా విధులు నిర్వహిస్తూ బదిలీపై చెరుకుపల్లి వచ్చారు. ఇక్కడ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న డి వెంకట కొండారెడ్డి బాపట్ల పోలీస్ ప్రధాన కార్యాలయానికి బదిలీ అయ్యారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ వై సురేష్ మాట్లాడుతూ మండల పరిధిలో శాంతిభద్రతల అదుపునకు తన వంతు కృషి చేస్తానని, చెరుకుపల్లిలోని ట్రాఫిక్ సమస్యను కూడా సక్రమమైన రీతిలో పరిష్కరిస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐకి పలువురు సిబ్బంది, స్థానికులు అభినందనలు తెలిపారు.

# పేదల సంక్షేమమే ధ్యేయం: మంత్రి నాగార్జున

**ప్రజాశక్తి-వేమూరు, బాపట్ల జిల్లా**

రాష్ట్రంలో పేద ప్రజల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పెద్దఎత్తున చర్యలు తీసుకున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. శనివారం వేమూరు నియోజకవర్గలోని చుండూరు మండలంలోని మండూరు, అమృతలూరు మండలంలోని మోపర్రు గ్రామాల్లో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున మరియు జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో గడిచిన నాలుగేళ్ల కాలంలో 2లక్షల 40వేల కోట్ల రూపాయల సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి నేరుగా లబ్ధిదారులకు అందజేశారన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను 95శాతం అమలు చేశారన్నారు. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలను అందజే యడానికి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో పేద ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లు ఉచితంగా అందించడానికి చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. రాష్ట్రంలో మహిళా సంక్షేమ కోసం ముఖ్యమంత్రి పెద్దపీట వేశారన్నారు. రాష్ట్రంలో మహిళలను రాజకీయ,ఆర్థిక, సామాజికంగా అభివృద్ధి చెందే దిశగా ముఖ్యమంత్రి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యకమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి ప్రజలు ప్రభుత్వానికి అండగా ఉండాలన్నారు. కలెక్టర్ రంజిత్ బాషా మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజల ముంగిట ప్రభుత్వ సేవలు అందించేందుకు ప్రభుత్వం పెద్దఎత్తున చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లాలో అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అర్హులైన వారు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివిధ కారణాల వల్ల పొందలేని వారి కోసం మరో అవకాశం కల్పించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎలాంటి చార్జీలు వసూలు చేయకుండా ప్రజలకు ఉచితంగా సర్టిఫికెట్లు ఇస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ప్రతి రోజూ జగనన్న సురక్ష క్యాంపుల్లో 40 వేల సర్టిఫికెట్లు ఇస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా మండూరు, పామర్రు జగనన్న క్యాంపుల్లో ప్రజలకు సర్టిఫికెట్లను మంత్రి, జిల్లా కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో రేపల్లె రెవెన్యూ డివిజనల్ అధికారి పార్థసారథి, వేమూరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి అర్జున్, చుండూరు తహసీల్దార్ డి కనకదుర్గ, ఎంపీడీఓ సుగుణమ్మ, అమృతలూరు తహసీల్దార్ మెహర్ కుమార్, ఎంపీడీఓ సుభాని తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లను అందజేస్తున్న మంత్రి నాగార్జున, కలెక్టర్ రంజిత్ బాషా

# సజ్జా చంద్రమౌళి సేవలు మరువలేనివి: హేమలత

**ప్రజాశక్తి-చీరాల**

చేనేత మరియు రైతాంగ సమస్యలపై శాసనసభలో అనేకసార్లు ప్రస్తావిస్తూ వారి సమస్యలకు అహర్నిశలు కృషి చేసిన మాజీ శాసనసభ్యులు సజ్జా చంద్రమౌళి సేవలు అందరికీ ఆదర్శనీయమని టిడిపి సీనియర్ మహిళ నాయకురాలు మరియు పొన్నూరు మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సజ్జా హేమలత అన్నారు. శనివారం దివంగత సజ్జ చంద్రమౌళి జయంతి సందర్భంగా స్థానిక గడియార స్తంభం సెంటర్లో ఉన్న ఆయన విగ్రహానికి తెలుగుదేశం పార్టీ మహిళా నాయకురాలు డాక్టర్ సజ్జా హేమలత ఆధ్వర్యంలో పూలమాలలు వేసి టిడిపి నాయకులు నివాళు లు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేనేతలు అధికంగా ఉన్న చీరాల నియోజకవర్గంలో వారి సమస్యలపై ఆనాడు శాసనసభ్యులుగా ఉన్న ప్రగడ కోటయ్య, సజ్జా చంద్రమౌళి అనేకసార్లు చేనేతల సమస్యలపై ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వారికి అండగా ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేశారని అన్నారు. తన మామయ్య సజ్జా చంద్రమౌళి ఆదర్శ భావాలతో ఆ కుటుంబం నుంచి తాను చీరాల నియోజకవర్గంలో తెలుగు దేశం పార్టీ అభివృద్ధికి, నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని, అందుకు టిడిపి నాయకులు కార్యకర్తలు అందరూ తమవంతు పూర్తి సహకారాన్ని అందించాలని ఆమె కోరారు. రాబోయే ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ జెండా ఎగరవేసేందుకు టిడిపి కార్యకర్తలు అందరూ కృషి చేస్తూ పార్టీ బలోపేతానికి అందరూ సహకరించాలని ఆమె కోరారు. ఆమె వెంట టిడిపి నాయకులు ప్రముఖ వ్యాపారవేత్త సజ్జా వెంకటేశ్వర్లు, దామర్ల శ్రీకృష్ణ పలువురు చేనేత నాయకులు పాల్గొన్నారు.




సజ్జా చంద్రమౌళి విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న డాక్టర్ సజ్జా హేమలత తదితరులు

# మాట తప్పి మడమ తిప్పిన సిఎం జగన్

- కార్మికుల సమస్యలను పట్టించుకోకుండా కాలయాపన
- కాంట్రాక్టు ఉద్యోగులతో పాటు ఔట్ సోర్సింగ్ వారిని పర్మినెంట్ చేయాలి
- సిఐటియు జిల్లా వర్క్ షాప్‌లో రాష్ట్ర కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు

**ప్రజాశక్తి-చీరాల**

రాష్ట్రంలో లక్షలాది మంది ఔట్‌సోర్సింగ్ కార్మికులు, స్కీం వర్కర్లు కనీస వేతనాలు అమలు కాక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జగన్ మోహన్‌రెడ్డి ఎన్నికలకు ముందు తెలంగాణ ప్రభుత్వం కంటే వెయ్యి రూపాయలు తమ రాష్ట్రంలో అమలు చేస్తానని హామీ ఇచ్చి నేటికీ నాలుగు సంవత్సరాలు గడుస్తున్న ఇంతవరకు ఇచ్చిన హామీని అమలు చేయలేదని హామీలు విస్మరించి సీఎం జగన్మోహన్ రెడ్డి మాట తప్పి మడమ తిప్పాడని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు విమర్శించారు. శనివారం చీరాల మండలం వాడరేవు కె పాల్ గెస్ట్ హౌస్‌లో సిఐటియు ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరుగుతున్న బాపట్ల జిల్లా వర్క్ షాప్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం అంగన్‌వాడీ వర్కర్లకు రూ.13,500 జీతం ఇస్తున్నారని, అయితే అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు కనీస వేతనం రూ.26,000 అమలు చేయాలని పోరాటాలు చేస్తున్నారని అన్నారు. ఎన్నికలకు ముందు జగన్ ఇచ్చిన హామీ ప్రకారం మన రాష్ట్రంలో రూ.14,500 చెల్లించాల్సి ఉండగా కేవలం రూ.11,500 మాత్రమే ఇవ్వడం పట్ల కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం ఎంత చిన్నచూపు చూస్తుందో అర్థమవుతుందని అన్నారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు అందరూ ఒకటే అంటూ మాటలు చెప్పుకొచ్చిన ముఖ్యమంత్రి నేడు కాంట్రాక్టు ఉద్యోగులను మాత్రమే పర్మినెంట్ చేస్తున్నట్లు స్టేట్మెంట్లు ఇస్తున్నారని, తక్షణమే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను కూడా పర్మినెంట్ చేయాలని, ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం కార్మిక సంఘ నేతలతో చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇటీవల అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు, మినీ వర్కర్లు, హెల్పర్లు వేలాది మంది రోడ్లపైకి వచ్చి తమ బాధను వెళ్లబోసుకున్నా రాష్ట్ర ప్రభుత్వం ఇంకా మొద్దు నిద్రలోనే ఉందని ఎద్దేవా చేశారు. అదేవిధంగా యూనివర్సిటీ ఇతర రంగాలలో పనిచేస్తున్న చిరు ఉద్యోగులందరూ తమ ఉద్యోగాలు పర్మినెంట్ అవుతాయని ఎన్నో కలలు కన్నారని అయితే లక్షలాది మందిని ఆప్కాస్‌లో పేరుతో వారిని బానిసత్వంలోకి నెట్టేస్తున్నారని ఆప్కాస్ నుంచి బయటపడేసి తమ ఉద్యోగాలను పర్మినెంట్ చేసి రక్షణ కల్పించాలని వారు ఎదురుచూస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకురాలు కె ధనలక్ష్మి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లు పూర్తయినా కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు కాలేదని అన్నారు. ఎన్నికలకు ముందు కార్మికులకు అనేక హామీలు ఇచ్చిన జగన్ మోహన్‌రెడ్డి గెలిచాక ప్రస్తుతం ఆ మాటను పూర్తిగా విస్మరించాలన్నారు. దీంతో చాలీచాలని జీతాలతో రాష్ట్రంలో కార్మికులందరూ ఆకలి బాధలతో అలమటిస్తున్నారు అన్నారు. మరి కొంతమందికి అయితే చేసిన పనికి జీతాలు సక్రమంగా చెల్లించడం లేదని దీంతో ఆ కుటుంబాలు పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. తక్షణమే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశానికి సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్ అధ్యక్షత వహించగా కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి సిహెచ్ మజుందార్, జిల్లా నాయకులు కె వసంతరావు, ఎన్ బాబూరావు, సిహెచ్ గంగయ్య, పి రేఖ ఎలిజిబెత్, తిరుమలరెడ్డి, శ్యాముల్యాలు, ప్రతాప్, వీరాంజనేయులు, శారద తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె ఉమా మహేశ్వరరావు

ప్రజాశక్తి 5
ఆదివారం 16 జులై 2023

# తాళ్లూరు ఎంపిడిఓను బదిలీ చేయాలి

## కలెక్టర్‌కు ప్రజాప్రతినిధులు, నాయకుల వినతి

**ప్రజాశక్తి-దర్శి**

తాళ్లూరు ఇన్‌ఛార్జి ఎంపిడిఒను బదిలీ చేయాలని కోరుతూ జిల్లా కలెక్టరు ఎఎస్ దినేష్‌కుమార్‌ను ఎంపిపి తాటికొండ శ్రీనివాసరావు, జడ్‌పిటిసి మారం వెంకటరెడ్డి, వైసిపి నాయకులు శనివారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తాను చెప్పిందే చేయాలంటూ ఎంపిడిఒను తమను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు తెలిపారు. విఠలాపురం మాజీ సర్పంచి కైపు అంజిరెడ్డి వద్ద సచివాలయం బిల్లు కోసం రూ. 50 వేలు తీసుకున్నట్లు తెలిపారు. గ్రామంలో మండల గ్రాంటు ద్వారా రూ. 1.80 లక్షల పనులు చేస్తే బిల్లు



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

చేసేందుకు ఎంపిడిఒ రూ.7 వేలు డిమాండ్ చేసినట్లు అంజిరెడ్డి తెలిపారు. ప్రతినెలా గ్రామాలలోని సమస్యల పై పంచాయతీ కార్యదర్శులతో సమావేశం పెట్టాలని కోరినప్పటికీ ఎంపిడిఒ స్పందించడం లేదని తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమంపై ఎంపిపికి నోట్‌ఫైల్ పెట్టకుండా ఎంపిడిఒ సొంతగా షెడ్యూల్ తయారు చేసినట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులను సైతం ఎంపిడిఒ ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. ఉపాధి హామీ చట్టం ఫీల్డ్ అసిస్టెంట్ల వద్ద కూడా పర్సంటేజీ అడుగుతున్నట్లు తెలిపారు. ఇలాంటి ఎంపిడిఒ తమ వద్దని వారు కలెక్టరుకు విన్నవించారు. దీంతో స్పందించిన జిల్లా కలెక్టర్ విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసిన వారిలో సర్పంచులు చార్లెస్ సర్జన్, వలి, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, కరిముల్లా, శ్రీనివాసరావు, కె వెంకటేశ్వర్‌రెడ్డి, యలమందారెడ్డి, శ్రీనివాసరెడ్డి ఉన్నారు.



పుస్తకాలు అందజేస్తున్న దాత

## పుస్తకాలు అందజేత

**ప్రజాశక్తి-చీమకుర్తి**

మండల పరిధిలోని పాటిమీదపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ బిల్లా వెంకటేష్ ఆధ్వర్యంలో నోటు పుస్తకాలు, పలకలు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా బిల్లా వెంకటేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యాబోధన అందిస్తున్నట్లు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ శిలార్ మాట్లాడుతూ విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకొని చదువులో రాణించాలన్నారు. అనంతరం దాత బిల్లా వెంకటేష్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయ సంజీవి, విజయలక్ష్మి, వాకా కవిత ,మైనంపాడు డైట్ కళాశాల ట్రైనీ ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు. **పామూరు :** ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు అందజేయడం అభినందనీయమని సిఐ కాటూరి శ్రీనివాసరావు తెలిపారు. మండల పరిధిలోని నిమ్మచెట్లపల్లి ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు జఫారీ చారిటబుల్ ట్రస్టు ఆర్థిక సహాయంతో శనివారం నోటు పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ జి. కరుణకుమారి, ఉపాధ్యాయులు కృష్ణారావు, రమేష్, శ్రీనివాసరావు, దివ్య, దర్శి మస్తాన్‌రావు పాల్గొన్నారు.

## విద్యార్థులకు అభినందనలు

**యర్రగొండపాలెం :** యర్రగొండపాలెంలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల విద్యార్థులు బిఇడి ప్రవేశ పరీక్షా ఫలితాల్లో సత్తా చాటారు. బి.సాయిమనోజ్ 68 మార్కులతో 96వ ర్యాంకు సాధించాడు. తలపాటి కిరణ్ 67 మార్కులతో 115వ ర్యాంకు, జి.గాయత్రి దేవి 64 మార్కులతో 186వ ర్యాంకు, గోరంట్ల శ్రీను 48 మార్కులతో 1159వ ర్యాంకు, సాలేమ్ రాజు 48 మార్కులతో 1,483వ ర్యాంకు సాధించాడు. అదేవిధంగాంగా పీజీ ప్రవేశ పరీక్షల్లో సాలేమ్ రాజు 43 మార్కులతో 90వ ర్యాంకు సాధించాడు. అడప కృష్ణవేణి 42 మార్కులతో 320వ ర్యాంకు, వేముల వెంకటలక్ష్మి 37 మార్కులతో 599వ ర్యాంకు సాధించింది. ఉత్తమ ర్యాంకు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీధర్ నాయుడు, ఇంగ్లీష్ అధ్యాపకులు ప్రదీప్ కుమార్, ఇతర అధ్యాపకులు అభినందించారు.

## మొక్కలు నాటడం అందరి బాధ్యత : మేయర్

**ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్**

మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించవచ్చని, మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యతగా తీసుకోవాలని నగర మేయర్ గంగాడ సుజాత పిలుపునిచ్చారు. జగనన్న హరిత నగరాలు కార్యక్రమంలో భాగంగా మన ఒంగోలు, మన చెట్టు, మన బాధ్యత అనే నినాదంతో నగరంలోని 17వ డివిజన్, తొమ్మిదో డివిజన్, రెండో డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం మొక్కలు నాటారు. ప్రజలు కూడా విరివిగా మొక్కలు నాటి జగనన్న హరిత నగరాల నిర్మాణాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఒంగోలు నగరాన్ని సుందరమైన హరిత నగరంలో తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఎన్‌సిఎపి నిధులు సుమారు రూ.5కోట్లు కేటాయించి ఇప్పటికే నగరంలోని అన్నీ పార్కులను సుందరీకరిస్తున్నట్లు తెలిపారు. ఒంగోలును హరిత నగరంగా మార్చడానికి అందరూ ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ



మొక్కలు నాటుతున్న మేయర్ సుజాత

మేయర్ వేమూరి బుజ్జి, కార్పొరేటర్లు నాగం వెంకటశేషయ్య, వెన్నపూస శోభారాణి, కార్పొరేషన్ డిఇఇ పద్మజ, ఎఇలు రఘురాం, హనుమంతు, వైసిపి నాయకులు గాంధీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుత్ అధికారుల దాడులు

**ప్రజాశక్తి-పెద్దదోర్నాల**

మార్కాపురం డిఈఈ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యుత్ సిబ్బంది శనివారం దాడులు నిర్వహించారు. ఆపరేషన్, పిపిఇ వింగ్ ఆధ్వర్యంలో అధికారులు 35 టీంలుగా ఏర్పడి దోర్నాల మండలంలోని అన్ని గ్రామాల్లో తనిఖీలు నిర్వహించారు. మొత్తం 1220 సర్వీసులకు తనిఖీ చేశారు. 65 అక్రమ సర్వీసులుగా గుర్తించారు. వారికి రూ. 2,63,700 అపరాధ రుసుం విధించినట్లు ఎఇ నాగేంద్రరెడ్డి తెలిపారు. ఈ దాడుల్లో డిఈఈ నాగేశ్వరరావు, విద్యుత్ సిబ్బంది హేమావత్, ఏడీ సీనా నాయక్, ఏఈ నాగేంద్రరెడ్డి, మార్కాపురం డివిజన్ పరిధిలోని ఏఈలు, ఆపరేషన్ ఏఈలు, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుత్ అధికారుల తనిఖీలు

**పెద్దదోర్నాల :** మండల పరిధిలోని జమ్మిదోర్నాల గ్రామంలో విద్యుత్ స్తంభాల అక్రమ విక్రమం అనే పేరుతో ప్రజాశక్తి దినపత్రికలో శనివారం ఓ కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన విద్యుత్ డీఈఈ ఆదేశాల మేరకు విద్యుత్ ఏడీఈ సీనా నాయక్ ఆధ్వర్యంలో జమ్మిదోర్నాల గ్రామంలోని పొలాల్లో విద్యుత్ సిబ్బంది తనిఖీలు నిర్వహిం చారు. స్థానిక రైతులతో మాట్లాడారు. విద్యుత్ స్తంభాలు ఎప్పుడు పడిపోయాయి, ఎప్పుడు బిగించారు, ఎంత మందికి బిగించారు అనే అంశాల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా విద్యుత్ ఏడీఈ సీనా నాయక్ మాట్లాడుతూ జమ్మిదోర్నాల పొలాల్లో రైతుల ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాల విషయంలో అక్రమాలు జరిగినట్లు పత్రికల్లో రావడంతో పరిశీలించి నివేదికను విద్యుత్ డీఈఈ నాగేశ్వరరావుకు అందజేయనున్నట్లు తెలిపారు.

ప్రజాశక్తి కథనానికి స్పందన

## అంగన్‌వాడీ కార్యకర్తపై పీడీకి ఫిర్యాదు

**ప్రజాశక్తి-వెలిగండ్ల**

మండల పరిధిలోని ఇమ్ముడిచెరువు అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త శనివారం విధులకు గైర్హాజరయ్యింది. ఈ విషయం గురించి పీడీ మాధురికి స్థానిక జడ్‌పిటిసి గుంటక తిరుపతిరెడ్డి ఫోను ద్వారా ఫిర్యాదు చేశారు. అందిన వివరాల ప్రకారం... ఉదయం 9:45గంటల సమయంలో అంగన్‌వాడీ కేంద్రం ఆయా, పిల్లలు బయట ఉండటాన్ని జడ్‌పిటిసి గమనించాడు. అందులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ విషయం గురించి తెలుసుకున్న అంగన్‌వాడీ కార్యకర్త బంధువులు వచ్చి అంగన్‌వాడీ కేంద్రం తాళాలు తీయడం గమనార్హం. ఈ సందర్భంగా జడ్‌పిటిసి అంగన్‌వాడీ కార్యకర్త గైర్హాజరు గురించి ఆరా తీశాడు. ఆమె వారం రోజులుగా రావడం లేదని ఆయా తెలిపింది. ఈ విషయం గురించి జడ్‌పిటిసి అంగన్‌వాడీ సూపర్ వైజర్‌ను ఫోన్‌లో సంప్రదించగా



అంగన్‌వాడీ ఆయాతో మాట్లాడుతున్న జడ్‌పిటిసి

టీచరు మూడు రోజుల పాటు సెలవు పెట్టినట్లు తెలిపారు. హాజరు పట్టీలో జనవరి వరకూ మాత్రమే సంతకాలు పెట్టిఉండటాన్ని గుర్తించారు. ఈ విషయాన్ని పీడీ దృష్టికి తీసుకెళ్లినట్లు జడ్‌పిటిసి తెలిపారు. ఈ విషయాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటామని పీడీ తెలిపినట్లు ఆయన పేర్కొన్నారు.

## ఎంపిడిఒ, తహాశీల్దారుకు వినతి

**ప్రజాశక్తి-జరుగుమల్లి**

మండల పరిధిలోని పీరాపురం గ్రామంలో శ్రీ పోలేరమ్మ దేవస్థానానికి చెందిన భూమిని కొందరు ఆక్రమించారు. ఈ విషయం గురించి గ్రామస్తులు అనేక సార్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. అయి నప్పటికీ అధికారులు స్పందించలేదు. ఆక్రమణ దారులపై చర్యలు తీసుకోలేదు. దీంతో ఆగ్రహించిన గ్రామస్తులు సుమారు 80 మంది శనివారం జరుగుమల్లిలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంపిడిఒ జలజాక్షి, తహశీల్దారు ఉషారాణికి వినపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లా డుతూ శ్రీ పోలేరమ్మ దేవస్థానానికి చెందిన భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగార్జున రెడ్డి

## పేదల సంక్షేమమే ధ్యేయం : ఎమ్మెల్యే

**పొదిలి :** పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి తెలిపారు. పొదిలి మండలం మల్లవరం సచివాలయ పరిధిలోని జువ్వలేరు గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగార్జున రెడ్డి గడప గడపకూ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ డైరెక్టర్ కొనిరెడ్డి వెంకట రమణారెడ్డి, వైసిపి మండల కన్వీనర్ శ్రీనివాస రెడ్డి, సర్పంచి శనగల సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

## గ్రానైట్ పాలిషింగ్ యూనిట్‌ను ప్రారంభించిన బూచేపల్లి

**ప్రజాశక్తి-చీమకుర్తి**

మండల పరిధిలోని ఆర్‌ఎల్‌పురం-కెవిపాలెం రోడ్డులో వైసిపి నాయకులు పయ్యావుల రాజా నూతనంగా ఏర్పాటు చేసిన గ్రానైట్ పాలిషింగ్ యూనిట్‌ను జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రానైట్ పరిశ్రమ యువతకు ఎంతగానో ఉపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూర్య గ్రానైట్ జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు, పయ్యావుల రాజా,నర్రా



గ్రానైట్ పాలిషింగ్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న వెంకాయమ్మ

ధనలక్ష్మి, గ్రానైట్ ఫ్యాక్టరీ యజమానులు పాల్గొన్నారు.

## సబ్సిడీపై పశుదాణా

**ప్రజాశక్తి-యర్రగొండపాలెం**

పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పాడి రైతులకు సమీకృత సంపూర్ణ దాణాను 60 శాతం సబ్సిడీపై పంపిణీ చేస్తున్నట్లు ప్రభుత్వ పశు వైద్యాధికారి డాక్టర్ ఉడుముల శివారెడ్డి తెలిపారు. సబ్సిడీ పోను కిలో రూ. 6.50 చొప్పున అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఒక్కో పశువుకు ప్రతిరోజూ ఐదు కేజీల దాణా అవసర మవుతుందన్నారు. సమీకృత సంపూర్ణ దాణా ద్వారా పాడి పశువులకు అన్ని రకాల పోషక విలువలు లభిస్తాయని తెలిపారు.

# దామచర్ల ఆంజనేయులుకు ఘన నివాళి

ప్రజాశక్తి-జరుగుమల్లి

మండల పరిధిలోని కామేపల్లి గ్రామంలో దివంగత మంత్రి దామచర్ల ఆంజనేయులు జయంతి శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి మండల అధ్యక్షుడు పోకూరి రవీంద్రబాబు ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్, దామచర్ల ఆంజనేయులు విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు.ఈ కార్యక్రమంలో కామేపల్లి మాజీ సర్పంచి ఏలూరి రాంబాబు, మాజీ ఎంపిపి పేముల విజయ నిర్మల, కొండపి నియోజక వర్గ టిడిపి కార్య నిర్వాహక కార్యదర్శి బత్తిన పూర్ణచంద్రరావు, టిడిపి మాజీ కన్వీనరు నలమోతు వెంకటేశ్వర్లు, కొమ్మాలపాటి కృష్ణ, పాతూరి కోటేశ్వరరావు, చెన్నారెడ్డి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. **టంగుటూరు :** నీతి, నిజాయతీకి మారుపేరుగా విలువలతో కూడిన రాజకీయాలు చేసిన మహోన్నత వ్యక్తి దామచర్ల ఆంజనేయులు అని కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య కొనియాడారు. మండల పరిధిలోని తూర్పునాయుడుపాలెంలో దామచర్ల జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వామి, దామచర్ల సత్య మాట్లాడుతూ కొండపి నియోజకవర్గ అభివద్ధికి పునాదులు వేసిన వ్యక్తి దామచర్ల ఆంజనేయులు అని తెలిపారు. టంగుటూరులోని టిడిపి కార్యాలయంలో మాజీ మంత్రి దామచర్ల ఆంజనేయులు జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు కామని నాగశ్రీను, మండల తెలుగు యువత అధ్యక్షుడు అబ్బూరి అభిషేక్, టిడిపి నాయకులు రామా గోపి, దామచర్ల పిచ్చన్న, కసుకుర్తి భాస్కర్ పాల్గొన్నారు. **కొండపి :** దివంగత మంత్రి దామచర్ల ఆంజనేయులు జయంతిని టిడిపి మండల అధ్యక్షుడు బి.యలమంద నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండ్ సెంటర్‌లోని ఎన్‌టిఆర్, దామచర్ల ఆంజనేయులు విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బత్తుల నారాయణస్వామి, నరసారెడ్డి, వసంతరావు, దామా మురళి, జి.రామూర్తి నాయుడు, దేపూరి సుబ్బారావు, టిడిపి యూత్ మండల అధ్యక్షుడు కాలేషా ,శంకర్, రావిపాటి బాలకృష్ణ, నేతి రవికుమార్, సోమయ్య, సుబ్బరామయ్య,ముక్కు ప్రసాదు పాల్గొన్నారు.


టంగుటూరులో వృద్ధుడికి కేక్ తినిపిస్తున్న నాయకులు


జరుగుమల్లిలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

**చీరలు పంపిణీ**

దివంగత మంత్రి దామచర్ల ఆంజనేయులు జయంతి సందర్భంగా మండల పరిధిలోని గోగినేనివారిపాలెం ఎస్‌సి కాలనీలో చీరలు పంపిణీ చేశారు. టిడిపి రాష్ట్ర మహిళా నాయకురాలు రావిపాటి సీతమ్మ తన సొంత నిధులుతో చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి కొమ్మాలపాటి లక్ష్మినర్సు, మండల మహిళా అధ్యక్షురాలు బొద్దులూరి ప్రసన్న లక్ష్మి, కొత్త మంగమ్మ, మాజీ ఎంపిపి దేపూరి రత్తమ్మ, బొద్దులూరి విద్యాసాగర్, శ్రీను పాల్గొన్నారు. **శింగరాయకొండ :** దివంగత మంత్రి దామచర్ల ఆంజనేయులు జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కందుకూర్ రోడ్‌లోని దామచర్ల ఆంజనేయులు, ఎన్‌టిఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేకును కట్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వేల్పుల శింగయ్య, చీమకుర్తి కష్ణ, కూనపురెడ్డి వెంకటసుబ్బారావు, ఇమ్మడిశెట్టి రామారావు, సుదర్శి ప్రసాద్‌రావు, గాలి హరిబాబు, దాసరి యానాదిరావు, పాత సింగరాయకొండ ఉపసర్పంచి నక్క బ్రహ్మేశ్వరరావు, శీలం సుబ్రహ్మణ్యం, నర్రా రాంబాబు పాల్గొన్నారు.

## 17న ప్రత్యేక 'స్పందన'

ప్రజాశక్తి-కొండపి

కొండపిలోని సీతారామ కల్యాణమండపంలో ఈ నెల 17న పత్యేక స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహశీల్దారు పి.సింగారావు తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో తహశీల్దారు మాట్లాడారు. కలెక్టర్ దినేష్‌కుమార్ ఆద్వర్యంలో ప్రత్యేక స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్న 2గంటల వరకు స్పందన కార్యక్రమంలో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. నియోజక పరిధిలోని ఆరు మండలాల ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేసి పరిష్కరించుకోవాలని ఆయన కోరారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## పోషకాహారం కిట్లు అందజేత

ప్రజాశక్తి -కంభం రూరల్

స్థానిక అర్బన్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు వైఎస్ఆర్ సంపూర్ణ పోషకాహారం కిట్లను స్థానిక వార్డు మెంబర్ సద్దాం హుస్సేన్ చేతుల మీదుగా శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త బి.ఆదిలక్ష్మి, బాలింతలు, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.

## 21 నుంచి ఇంటింటి సర్వే

ప్రజాశక్తి-కొండపి

కొండపి నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాలలో ఈ నెల 21 నుంచి బిఎల్‌ఒలు ఇంటింటి సర్వే నిర్వహించనున్నట్లు ఎలక్షన్ డిటీ నారదముని తెలిపారు. స్థానిక కామేపల్లి రోడ్డులో శ్రీ సాయి సీతారామ కళ్యాణ మండపంలో బిఎల్‌ఒలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నారదముని మాట్లాడుతూ ప్రతి గ్రామంలో బిఎల్‌ఒలు ఈ నెల 21 నుంచి నెలరోజుల పాటు ఇంటింటికీ తిరిగి ఓటర్ల జాబితాను పరిశీలిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరు మండలాల తహశీల్దారులు, రెవెన్యూ సిబ్బంది, బిఎల్‌ఒలు పాల్గొన్నారు.

## విజిలెన్స్ అధికారులు దాడులు

ప్రజాశక్తి- కొత్తపట్నం

మండల పరిధిలోని రాజుపాలెం గ్రామంలో పురుగు మందుల దుకాణాలపై విజిలెన్స్ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు.ఈ సందర్భంగా విక్రయానికి సంబంధించిన పత్రాలు లేని రూ. 6,78,165 రూపాయల విలువైన ఎరువులు, పురుగుమందులను అమ్మకాలను నిలుపు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎఒ మోహన్ రెడ్డి, ఒంగోలు బిజినెస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు ,ఎన్ రాఘవరావు , సబ్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు, విజిలెన్స్, వ్యవసాయ అధికారి సంగమేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

## నేడు ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

ఒంగోలులోని అంబేద్కర్ భవన్‌లో ఆదివారం మాదిగ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహి స్తున్నట్లు ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షుడు తోరటి ఆనంద్ ఓ ప్రకటనలో తెలిపారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహాజన నేత మందకష్ణ మాదిగ హాజరు కానున్నట్లు తెలిపారు. మండల పరిధిలోని మాదిగ ఉద్యోగులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. **మద్దిపాడు :** ఒంగోలులోని అంబేద్కర్ భవన్‌లో నేడు నిర్వహిస్తున్న మాదిగ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనంలో మాదిగ ఉద్యోగులందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షుడు తోరాటి ఆనంద్ మాదిగ ఓ ప్రకటనలో కోరారు.

## 23న ప్రజా గర్జన సింహాగర్జన

**దర్శి :** ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీల ఐక్యతను చాటి చెప్పేందుకు రామచంద్రయాదవ్ ఆధ్వర్యంలో ఈనెల 23న గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీ ఎదురుగా ప్రజా సింహగర్జన సభ నిర్వహిస్తున్నట్లు జిల్లా నాయకులు నర్రావుల శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. స్తానిక లంకోజనపల్లి రోడ్‌లోని బిసి సంక్షేమ కార్యాలయంలో సభకు సబంధించిన వాల్‌పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రంగారావు యాదవ్, కోటేశ్వరరావు యాదవ్, హుస్సేన్, ప్రేమ్‌కుమార్, రవి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# టిడిపి నాయకుల సమావేశం

ప్రజాశక్తి-వెలిగండ్ల



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

టిడిపి మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి కారంపూడి వెంకటేశ్వర్లు అధ్యక్షతన బూత్, యూనిట్ ఇన్‌ఛార్జులు, ముఖ్య నాయకులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కారేంపూడి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఓటు పరిశీలనలో మన బూత్ ఏజెంట్లు పాల్గొనాలన్నారు. పార్టీ సానుభూతిపరులు, కొత్తగా వివాహం అయిన వారిని ఓటరుగా చేర్పించాలన్నారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి చేపట్టిన యువగళం పాదయాత్రలో ప్రతి పంచాయతీ నుంచి భారీ సంఖ్యలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌ఛార్జి దొడ్డా వెంకట సుబ్బారెడ్డి, టిడిపి మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, నియోజకవర్గ తెలుగు రైతు, బిసిసెల్ అధ్యక్షుడు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి గోనా ప్రతాప్, మండల తెలుగు యువత, తెలుగు రైతు అధ్యక్షుడు కర్ణాటి భాస్కర్‌రెడ్డి, మీనిగ కాశయ్య, టిడిపి మండల ఉపాధ్యక్షుడు మోటాటి సుబ్బారెడ్డి, బి.లక్ష్మీనారాయణ, కీసరి రమణారెడ్డి, సానా నారాయణరెడ్డి పాల్గొన్నారు.

# రమణారెడ్డికి పార్టీతో సంబంధం లేదు : వైసిపి

- నిన్నటి వరకూ వైసిపిలోనే ఉన్నాడు : టిడిపి
- పోటా పోటీగా సమావేశాలు

ప్రజాశక్తి-పిసిపల్లి

మండల పరిధిలోని పెదఒరిమడుగు గ్రామానికి చెందిన కొందరు టిడిపి మండల అధ్యక్షులు వేమూరి రామయ్య ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు. టిడిపి కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోనికి ఆహ్వానించారు. దీంతో పిసిపల్లి మండల వైసిపి నాయకుల్లో ఆందోళన మొదలైంది. పెదఒరిమడుగుకు చెందిన జంపని రమణారెడ్డి 2020కి ముందు టిడిపిలో ఉన్నారు. ఎంపిటిసి ఎన్నికల్లో చింతగుంపల్లి ప్రాదేశికం నుంచి టిడిపి తరుపున నామినేషన్ వేశారు. ఆ తరువాత కరోనా నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా పడ్డాయి. ఈ నేపథ్యంలో జంపని రమణారెడ్డి, అతని అనుచరులు వైసిపిలో చేరారు. రమణారెడ్డి టిడిపి తరుపు ఎంపిటిసిగా నామినేషన్ వేసినప్పటికీ వైసిపిలో చేరి రమణారెడ్డికి సమీప ప్రత్యర్థి అభ్యర్థి భూమిరెడ్డి కొండారెడ్డి గెలుపు కోసం కృషి చేశారు. రమణారెడ్డి టిడిపిలో ఇప్పుడు చేరడంతో వైసిపి నాయకులకు గుండెల్లో గుబులు పుట్టింది.ఎంపిపి అత్యాల జఫన్య, వైసిపి నాయకులు ఒకేరెడ్డి తదితరులు కనిగిరిలో శనివారం ప్రెస్‌మీట్ పెట్టి రమణారెడ్డి తమ పార్టీతో సంబంధం లేదని తెలిపారు. అందుకు టిడిపి నాయకులు కూడా స్పందించారు. వేమూరి రామయ్య ఆధ్వర్యంలో పిసిపల్లిలో కార్యకర్తలతో సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ తెలుగుదేశంపై అవాకులు, చవాకులు విసరొద్దని, రమణారెడ్డి వైసిపి నుంచి శుక్రవారం టిడిపిలో చేరినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఉండేలా పిచ్చిరెడ్డి, వై.నాగేంద్రబాబు, మూలె సత్యంరెడ్డి, కె.వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

## వాహనచోదకులకు అవగాహన

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

వాహన చోదకులు రోడ్డు భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్ఐ శివనాగరాజు తెలిపారు. మండల పరిధిలోని హాజీపురం క్రాస్ రోడ్డు వద్ద వాహన ప్రమాదాల నివారణపై వాహన చోదకులకు శనివారం అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఆటోల్లో పరిమితికి ప్రయాణికులను ఎక్కించరాదని తెలిపారు.

## శాస్త్రవేతలకు అభినందనలు

ప్రజాశక్తి-తర్లుపాడు

చంద్రయాన్-3లో భాగంగా ఇస్రో ఆధ్వర్యంలో శ్రీహరికోట నుంచి ప్రయోగించిన రాకెట్ నుంచి రోవర్ విడివడి భూస్థిర కక్షలో విజయవంతంగా ప్రవేశించిన సందర్భంగా అంతరిక్ష ప్రయోగాల పరంపరలో భారత కీర్తిపతాకను అభినందిస్తూ స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రత్యేక పంథాలో శాస్త్రవేత్తలను అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్ధులు ఇస్రో ఆకారంలో కూర్చొని జయహో నినాదాలతో శాస్త్రవేత్తలకు తమ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ముత్తోజు సుధాకర్, ఉపాధ్యాయులు, సిఆర్‌ఎంటి ప్రభాకర్ పాల్గొన్నారు.

## వెంకట్రావుకు పరామర్శ

**పామూరు :** మండల పరిధిలోని వెంకటాపురం గ్రామానికి చెందిన పోతురాజు వెంకట్రావును టిడిపి నాయకులు శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్యక్షేమాల గురించి అడిగి తెలుసుకున్నారు. వెంకట్రావును పరామర్శించిన వారిలో ప్రభాకరచౌదరి, రమణయ్య, రామారావు, వై.ప్రసాద్‌రెడ్డి, శ్రీనివాసులు, దండె శంకర్ ఉన్నారు.

## షార్ట్ సర్క్యూట్‌తో ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధం

**యర్రగొండపాలెం :** యర్రగొండపాలెం పట్టణంలో పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ శనివారం షార్ట్ సర్క్యూట్ అయ్యింది. దీంతో మంటలు రేగాయి. ట్రాన్స్‌ఫార్మర్ నుంచి పొగలు వస్తూ మంటలు దట్టంగా రావడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. పోలీస్ సిబ్బంది వెంటనే అగ్ని మాపక, విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించారు. స్పందింన విద్యుత్ సిబ్బంది ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో విద్యుత్ ప్రసారాన్ని నిలిపివేశారు. అగ్ని మాపక సిబ్బంది హుటాహుటినా ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. అప్పటికే ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది.

# వేటపాలెంలో పడకేసిన పారిశుధ్యం

## పట్టించుకోని పంచాయతీ అధికారులు

**ప్రజాశక్తి-వేటపాలెం**

మండల కేంద్రమైన వేటపాలెం గ్రామ పంచాయతీలో పారిశుధ్యం పడకేసింది. పంచాయతీ సరిహద్దులలో రోడ్లపైనే వారం కితం కురిసిన వర్షపు నీరు నీళ్లు పోయే దారి లేక మురుగు గుంటలను తలపిస్తున్నాయి. పట్టించుకోవాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారే తప్ప ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. గ్రామ పంచాయతీలోని నాయనపల్లి పోలేరమ్మ గుడి వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆనుకొని ఉన్న రోడ్డు గుండా సర్వోదయ కాలనీ వైపు వెళ్లే రోడ్డు రైస్ మిల్లు వరకు మెరకగాను అక్కడ నుంచి పల్లంగానూ ఉంది. ఈ పల్లం వైపు వారం క్రితం పడిన వర్షం నీళ్లు పోయే దారి లేక నిలబడి పోయాయి. ఆ నీళ్లు ఇప్పుడు పరిశీలిస్తే మురికిగుంటను తలపిస్తూ ఉంది దానికి తోడు ఆ ట్రాన్స్‌ఫార్మర్ దగ్గరే చుట్టుపక్కల చెత్త మొత్తం తీసుకొచ్చి పోయటం వలన పందులు కుక్కలు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి నాయనపల్లి వెస్ట్ పాఠశాల రోడ్డు నుంచి జీడిపట్టీల వైపు వెళ్లే రోడ్డు టర్నింగ్ వద్ద రోడ్డు పల్లమైపోయి నీళ్లు నిలబడి పోయాయి. ఇక్కడ కూడా మురుగు గుంతలను తలపిస్తున్నాయి. అదేవిధంగా కనికా పరమేశ్వరి గుడి వద్ద మలుపులో నీళ్లు నిలబడిపోయి మురుగు కాలువలను తలపిస్తోంది. సర్వోదయ కాలనీ గుంట బడి వద్ద కూడా ఇదే దుస్థితి ఉంది. ఆయా ఏరియాలలో సైడ్ మురుగు కాలువలు లేనందువలన ఈ పరిస్థితి దాపురించింది. మరోపక్క ప్రధాన కూడళ్లలో చెత్తకుప్పలు ఎక్కడికక్కడ పేరుకుపోయి దోమలకు నిలయంగా మారిపోయి ఉన్నాయి రాత్రివేళ విద్యుత్ కోతలతో ప్రజలు జాగారం చేస్తున్నారు. సాక్షాత్తూ మండల అభివృద్ధి అధికారి ఈ గ్రామానికి ప్రత్యేక అధికారిగా ఉన్నారు. అయినప్పటికీ గ్రామంలో చెత్త ఎక్కడికక్కడ పేరుకుపోయి ఉండటంతో ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కలుగజేసుకొని గ్రామంలో పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలని ప్రజలు కోరుతున్నారు.



నాయనపల్లి పోలేరమ్మ గుడి వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చెంతన నేటికీ నిలిచిఉన్న వర్షపు నీరు.. పక్కనే చెత్తాచెదారం



సమావేశంలో మాట్లాడుతున్న శాసనసభ్యులు కోన రఘుపతి

# ప్రజలకు చేరువయ్యేందుకే 'సురక్ష': కోన

**ప్రజాశక్తి-పిట్టలవానిపాలెం**

ప్రజలకు మరింత చేరువ అవటమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సురక్ష పథకాన్ని రూపొందించారని శాసన సభ్యులు కోన రఘుపతి అన్నారు. మండలంలోని ఖాజీపాలెం గ్రామంలో శనివారం నిర్వహించిన సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోనా మాట్లాడుతూ ప్రజలకు రక్షగా ఈ సురక్ష కార్యక్రమం ఉంటుందని అన్నారు. గత ప్రభుత్వాలు ప్రజల పట్ల చేసిన నిర్లక్ష్యం ఇప్పుడు లేకుండా ప్రజల వద్దకు పాలన అందిస్తున్నామని అన్నారు. ప్రజలకు అవసరమైన పత్రాలను నేరుగా ఈ కార్యక్రమం ద్వారా కాలాతీతం కాకుండా అందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రం అభివృద్ధి దిశగా దూసుకుపోతున్న తరుణంలో ప్రతిపక్ష పార్టీల విమర్శలు అర్ధరహితం అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసన సభ్యుడు అనంత వర్మ రాజు, మండల ఉపాధ్యక్షుడు రామరాజు, లీల శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ కుంతం అనూష, ప్రసన్న రాజు, ఎంపీటీసీ కాగిత కాంత కుమారి, ఎంపీడీఓ శేషమాంబ, సుబ్బారావు, కోటేశ్వరరావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



విజయనగర కాలనీలోని రుధిర క్షేత్రం వద్ద మాట్లాడుతున్న గ్రామపెద్దలు

# రేపు కారంచేడు మృతవీరుల సంస్మరణ సభ

**ప్రజాశక్తి-చీరాల**

1985 జూలై 17న కారంచేడులో జరిగిన దారుణ మారణకాండకు నేటితో 38 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా స్థానిక విజయనగర్ కాలనీ సమీపంలో ఉన్న కారంచేడు మృతవీరుల రుధిరక్షేత్రం వద్ద జులై 17న ఉదయం 10 గంటలకు జరుగనున్న సంస్మరణ సభను జయప్రదం చేయాలని విజయనగర కాలనీ గ్రామపెద్దలు అన్నారు. శనివారం రుధిర క్షేత్రం వద్ద జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 1985 జులై 17న అగ్రవర్ణ భూస్వాములు కారంచేడు మాదిగపల్లెపై పడి అతి దారుణంగా వెంటాడి వేటాడి ఆరుగురిని చంపి 48 మందిని గాయాలపాలు చేశారన్నారు. తన కుమారుడిని కళ్లముందే చంపటం చూసిన ప్రధాన సాక్షి దుడ్డు ఆలీసమ్మను కిరాతకంగా చంపారని అన్నారు. న్యాయస్థానాల్లో నిందితులకు శిక్షలు పడాలని 24 సంవత్సరాలు పోరాటం చేసి అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీం కోర్టులో దోషులకు శిక్షలు పడేవరకూ నిబద్ధతతో కారంచేడు బాధితులు పోరాడారని అన్నారు. బాధితుల పక్షాన పోరాడిన ఆనాటి కారంచేడు ఉద్యమంలో పనిచేసిన నాయకులు, మేధావులు, కార్యకర్తలు అందరూ 38వ కారంచేడు మృతవీరుల సంస్మరణ సభకు విచ్చేసి మృతవీరులకు ఘన నివాళి అర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దుడ్డు భాస్కరరావు, తేళ్ల వెంకటస్వామి, తేళ్ల సుబ్బారావు, బుడంగుంట్ల లక్ష్మీ నరసయ్య, సిర్ర భగత్‌సింగ్, గొర్రెపాటి రవి, దుడ్డు వెంకటేశ్వర్లు, బొంత అంకయ్య, గ్రామపెద్దలు తేళ్ల లక్ష్మీ ప్రసాద్, తేళ్ల దేవదానం, తేళ్ల ప్రసాద్, దుడ్డు ఏసుపాదం తదితరులు పాల్గొన్నారు.

# ఆశాల సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాశక్తి-రేపల్లె**



మెడికల్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆశ వర్కర్లు

ఆశ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని జూలై 18 జిల్లా డీఎంహెచ్‌ఓ ఆఫీసు వద్ద ధర్నాను తెలియపరుస్తూ మొళ్ళగుంట, రేపల్లె పట్టణ అర్బన్ హెల్త్ సెంటర్స్‌లో మెడికల్ ఆఫీసర్స్‌కు వినతిపత్రం అందజేశారు. రేపల్లె డివిజన్ ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియూగా రేపల్లె మండలం, పట్టణంలో పిహెచ్‌సిలో మెడికల్ ఆఫీసర్స్‌కు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్స్ యూనియన్ మొళ్ళగుంట హాస్పటల్ యూనియన్ అధ్యక్షురాలు సిహెచ్ వీరాలక్ష్మి, రేపల్లె టౌన్ అధ్యక్షురాలు టి బుజ్జి మాట్లాడుతూ తీవ్రంగా పెరిగిన పని ఒత్తిడి తగ్గించాలని, నాణ్యమైన ఫోన్స్ 4జితో ఇవ్వాలని, ఆన్‌లైన్లో వర్క్ మినహాయించాలని, సంబంధం లేని పనులు చేయించరాదని, సెలవులు మంజూరు చేయాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఆశా సమస్యలు పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా జూలై18 డీఎంహెచ్‌ఓ ఆఫీస్ వద్ద ఆందోళన చేస్తామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జీతాలు పెంచకుండా పనికి సంబంధం లేని అదనపు పనులు చేస్తూ ఆశావర్కర్ల శ్రమదోపిడీ చేస్తున్నారని విమర్శించారు. నోటీసులు ఇచ్చే కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియ న్ సభ్యులు లక్ష్మి నాంచారమ్మ, వేంకటేశ్వరమ్మ, పావని తదితరులు పాల్గొన్నారు.



మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న మాజీ మంత్రి ఆనందబాబు

# పలు కార్యక్రమాలలో ఆనందబాబు

**ప్రజాశక్తి-భట్టిప్రోలు**

మాజీ మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబు మండలంలో శనివారం పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. వెల్లటూరు గ్రామానికి చెందిన టిడిపి నాయకులు భానావత్ ధూళియా తల్లి దాలి అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. అలాగే ఉత్తర సంఘంలో పెరవలి వెంకరస్వామి అనారోగ్యంతో చికిత్స పొంది ఇంటి వద్దనే విశ్రాంతి పొందుతుండగా పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని వాకబు చేశారు. అదేవిధంగా ఎంపిటిసి వాకా వెంకట నారాయణ తండ్రి శ్యామలరావు అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. అంతేకాక పెదపులివర్రు గ్రామం జీలుగువారిపాలెం గ్రామానికి చెందిన టీడీపీ క్రియాశీలక కార్యకర్త నిమ్మగడ్డ సుధాకర్ కుమారుడు విజయబాబు అకాలంగా మృతి చెందడంతో సుధాకర్ కుటుంబాన్ని పరామర్శించి సంతాపం తెలియజేశారు. అదే గ్రామానికి చెందిన జీలుగు సుధాకర్ కుమారుడు బాబు(18) అనారోగ్యంతో మృతి చెందగా పరామర్శించి భరోసానిచ్చారు. ఈయన వెంట వెల్లటూరు, పెదపులివర్రు గ్రామాల టిడిపి నాయకులు పాల్గొన్నారు.



సూర్యలంక బాధితులను పరామర్శిస్తున్న విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ

# సూర్యలంక సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం

**ప్రజాశక్తి-బాపట్ల**

సూర్యలంక బాధితులను బాపట్ల జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కట్టా శ్రీనివాసరావు, గుదే రాజారావు పరామర్శించారు. శనివారం కమిటీ సభ్యులు సూర్యలంకను సందర్శించారు. ఈ నెల 11న బాపట్ల జిల్లా అడవి పంచాయతీ సూర్యలంక బీచ్ వద్ద గిరిజన కుటుంబాలు నివసిస్తున్న స్థలాన్ని బీచ్ అభివృద్ధిలో భాగంగా ముదస్తు సమాచారం లేకుండా గ్రామ రెవెన్యూ అధికారి పూరిగుడిసెలను తొలగించి సామగ్రిని సమీపంలోని డంపింగ్ యార్డ్‌లో పడేశారు. సంఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకొని వెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కిడ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ దేవరపల్లి డేవిడ్ రాజ్, కవిత సర్వీస్ ఆర్గనైజేషన్ కార్యదర్శి ఏపూరి జోసెఫ్ పాల్గొన్నారు.




సభలో మాట్లాడుతున్న మంత్రి నాగార్జున

# ధ్రువీకరణ పత్రాల పంపిణీ

**ప్రజాశక్తి-కొల్లూరు**

జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా కొల్లూరు మండలం పోతర్లంక గ్రామంలో శనివారం 11 రకాల ధ్రువీకరణ పత్రాలను సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం సమస్యల పరిష్కారానికి దోహదపడుతుందని, అర్హత కలిగిన వారందరూ దీనిని వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు శ్రీనివాసరావు, ఈవోపీఆర్‌డి సిహెచ్ రవిబాబు, సర్పంచ్ పరిశ నిర్మల, కొల్లూరు మండల వైస్ ప్రెసిడెంట్ మురాల రాంబాబు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న బిసి సంక్షేమ సంఘం నాయకులు

# ఐలవరంలో కేసన పుట్టినరోజు వేడుక

**ప్రజాశక్తి-భట్టిప్రోలు**

బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు పుట్టినరోజు వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఐలవరం గ్రామంలో నాయకులు కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా వేమూరు నియోజకవర్గ అధ్యక్షులు మురాల వాసుదేవ గౌడ్ మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా బిసిల సంక్షేమం కోసం కేసన ఎంతో కృషి చేస్తున్నారని, బి,సిలకు రాజ్యాధికారమే లక్ష్యంగా పనిచేస్తున్నారని, ఇలాంటి మరెన్నో పుట్టిన రోజులు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల గౌరవ అధ్యక్షులు అనగాని ఏడుకొండలు, అధ్యక్షులు యశోదా కృష్ణ, దీపాల ప్రసాద్, పోతార్లంక రాజేష్, బెల్లంకొండ సుబ్బారావు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న దామచర్ల జనార్ధన్‌రావు

# దొంగ ఓట్లను గుర్తించాలి

## టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్ధన్‌రావు

**ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్**

ఒంగోలు నగరం, మండలంలో దొంగ ఓట్లను గుర్తించి, కొత్త ఓట్లను త్వరగా చేర్పించాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు పార్టీ శ్రేణులకు దిశా నిర్ధేశం చేశారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఒంగోలు నగర, మండల క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలతో సమగ్ర శిక్షణా సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా దామచర్ల జనార్ధన్‌రావు మాట్లాడుతూ ప్రతిఒక్క ఇన్‌చార్జి ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని టెక్నాలజీ అందిపుచ్చుకొని ముందుకు పోవాలని సూచించారు. ప్రతి ఒక్క ఇన్‌చార్జి వారి పరిధిలో ఓట్ల వెరిఫికేషన్ చేసుకోవడం, దొంగ ఓట్లును గుర్తించడం, కొత్త ఓటర్లను చేర్పించడం త్వరగా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పరిశీలుకులు వినకొండ సుబ్రహ్మణ్యం, నాయకులు, తెలుగునాడు రాష్ట్ర అంగన్‌వాడీ, డ్వాక్రా సాధికార సంస్థ సంయుక్త కార్యదర్శి పెద్దిశెట్టి వరలక్ష్మి పాల్గొన్నారు.

## ప్రకాశం జిల్లాకు

# రూ.10 వేల కోట్ల ప్యాకేజీ ప్రకటించాలి

## ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు డిమాండ్

**ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్**

ప్రభుత్వాలు ప్రకాశం జిల్లాను వెనుకబడిన జిల్లాగా గుర్తించి పదివేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని ఎమ్మెల్సీ కెఎస్. లక్ష్మణరావు డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్య భవనంలో సిపిఎం జిల్లాస్థాయి రాజకీయ తరగతులు శనివారం ప్రారంభమయ్యాయి. తొలుత పార్టీ పతాకాన్ని సీనియర్ నాయకులు పెంట్యాల హనుమంతరావు ఆవిష్కరించారు. తరగతులకు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జివి.కొండారెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య ఉపన్యాసకులుగా పాల్గొన్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రకాశం జిల్లా అనేక రంగాలలో వెనకబడి ఉందన్నారు. పారిశ్రామిక అభివద్ధికి, దొనకొండ పారిశ్రామిక కారిడార్, కనిగిరి నిమ్జ్‌లను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు, నడికుడి- శ్రీకాళహస్తి రైల్వే లైన్ పనులు నత్తనడకన సాగుతున్నాయని,



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

అమరావతి- అనంతపురం ఎక్స్ ప్రెస్ హైవే రహదారి నిర్మాణం ప్రారంభ దశలోనే ఉందన్నారు. జిల్లాలో పెండింగ్ లో ఉన్న వెలుగొండ, గుండ్లకమ్మ, సంగమేశ్వర, పాలేటిపల్లి ప్రాజెక్టులు నిధుల కొరతతో పూర్తి చేయలేదన్నారు.విద్య వైద్య సంస్థల నిర్మాణం మందకొడిగా సాగుతున్నాయన్నారు. ఇవి పూర్తి కావాలన్నా జిల్లా సమగ్ర అభివద్ధి చెందాలన్నా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పదివేల కోట్ల గ్రాంట్ కేటాయించాలన్నారు..

**పార్టీలు అవకాశవాద వైఖరి విడనాడాలి**
**సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన**

రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా, విశాఖ స్టీల్ అమ్ముతూ, విశాఖ రైల్వే జోన్ అమలు చేయకుండా రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు ఉదతం కావాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం పిలుపునిచ్చారు. రాజకీయ శిక్షణా తరగతులలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి,టిడిపి, జనసేన పార్టీలు రాష్ట్ర ప్రయోజనాలు కాపాడటానికి అందదరూ ముందుకు రావాలన్నారు..శిక్షణా తరగతుల్లో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పూనాటి ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్‌కె.మాబు, కంకణాల ఆంజనేయులు, చీకటి శ్రీనివాసరావు, వెల్లంపల్లి ఆంజనేయులు, నగర కార్యదర్శి జి.రమేష్, వివిధ ప్రాంతాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళల పోరు యాత్రను జయప్రదం చేయండి

## ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి పిలుపు

**ప్రజాశక్తి - ఒంరగోలు కలెక్టరేట్**

మద్యం, మత్తు పదార్ధాలను నిషేధించాలని, మహిళలపై హింసను నిలువరించాలని కోరుతూ ఈనెల 28 నుంచి ఆగస్టు 8 వరకు నిర్వహిస్తున్న మహిళల పోరుయాత్ర జాతాను జయప్రదం చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి విజ్ఞప్తి చేశారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాల యంలో హింసపై మహిళలు నిర్వహించనున్న యాత్రకు సంబంధించిన కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ దేశం, రాష్ట్రంలో మహిళలపై హింస రోజురోజుకు పెరిగిపోతోందన్నారు. మనువాద భావజాలాన్ని పాలకులు అనుసరిస్తుండటంతో ఈ దురాగతాలు రోజురోజుకి పెచ్చరిల్లిపోతున్నాయన్నారు. మహిళా రెజ్లర్లపై బిజెపి ఎంపీ లైంగిక వేధింపులకు పాల్పడితే అతనిపై చర్యలు తీసుకోకుండా కేంద్రం ప్రేక్షక పాత్ర వహిస్తోందన్నారు. దేశ రాజధాని లోని ప్రముఖులైన మహిళా నేతలు నెలలు తరబడి ఉద్యమిస్తే ప్రభుత్వం నిందితునికి అనుకూలంగా వ్యవహరించడం అమానుషమన్నారు. ప్రభుత్వాలు ఇలా వ్యవహరించబట్టే నేరాలు ఘోరాలు విపరీతమ వుతున్నాయన్నారు. . మహిళలపై జరుగుతున్న హింసకు సంబంధించిన కేసులను 41 రోజుల్లో ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా విచారణ జరిపించి నిందితులకు కఠిన శిక్షలు విధించాలని ఆమె డిమాండ్ చేశారు. డి- అడిక్షన్ సెంటర్స్ ను విస్తతపరిచి పటిష్టంగా పనిచేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సయ్యద్ షమ్మీ, జిల్లా నాయకులు జి ఆదిలక్ష్మి, ఎన్. మాలతి బి. రాజ్యలక్ష్మి, బి. గోవిందమ్మ, కె. రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.




కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఐద్వా నాయకులు

# అంగన్‌వాడీల పోరుబాట

సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రకాశం, బాపట్ల జిల్లాల అంగన్‌వాడీలు 36 గంటల పాటు ధర్నా నిర్వహించారు. ధర్నాను భగ్నం చేసేందుకు పెద్ద ఎత్తున పోలీసులు మోహరించారు. వేలాదిగా వచ్చిన అంగన్‌వాడీల నియంత్రించడం కష్టమని భావించిన పోలీసులు పక్కకు తప్పుకున్నారు. కనీస వేతనాలు, గ్రాట్యూటీ అమలు చేయాలని అంగన్‌వాడీలు నినాదాలు చేశారు. బడ్జెట్ పెంచి తల్లులు,చిన్నారులకు పౌష్టికాహారం అందజేయాలన్నారు.గతంలో అంగన్ వాడీలకు అమలవుతున్న అమ్మఒడి, ఆరోగ్యశ్రీ, విద్యుత్తు సబ్సిడీ పథకాలను కూడా రద్దు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్ఆర్ పోషణ పథకానికి భోజనం వండటానికి సొంత డబ్బులు ఖర్చు చేస్తున్నట్లు వాపోయారు. పని భారంతో మానసిక ఒత్తిడికి గురై రోగాల బారినపడి ప్రాణాలు కోల్పోతున్నట్లు తెలిపారు.




అరాచక పాలనకు అంతమే ధ్యేయంగా టిడిపి యువ నేత లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 155వ రోజుకు చేరింది. ఈ పాదయాత్ర ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని కందుకూరు నియోజకవర్గంలోకి శనివారం చేరింది. ఇప్పటి వరకూ పాదయాత్ర 2,040 కిలోమీటర్ల పూర్తయ్యింది. ప్రస్తుతం ప్రకాశంలోని కొండపి, కనిగిరి,దరిశి,మార్కాపురం,యర్రగొండపాలెం నియోజక వర్గాల్లో పాదయాత్ర సాగనుంది.

వైద్యులపై దాడులు జరిగితే కఠిన శిక్షలు అమలు చేసేలా కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. చీరాల రామాపురంలో ఐఎంఎ రాష్టస్థాయి వర్క్‌షాప్ ఇటీవల నిర్వహించారు.వైద్యులపై ఇటీవల కాలంలో దాడులను జరుగుతున్నాయని వాటిని అరికట్టాలని కోరారు. 2008లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న హయాంలో వైద్యుల పరిరక్షణ చట్టాన్ని దేశంలోనే మొట్టమొదటిసారిగా తీసుకొచ్చినట్లు తెలిపారు.

రవాణా, పోలీస్ శాఖలు అనేక జాగ్రత్తలు తీసుకుంటున్నా రహదారి ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ప్రకాశం జిల్లా దర్శి వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఏడుగురు వ్యక్తులు అక్కడికక్కడే మతి చెందారు. పెళ్లి బస్సు అదుపుతప్పి సాగర్ బ్రాంచి కాలువలో బోల్తాకొట్టింది. ఆర్‌టిసి బస్సు అయితే సురక్షితం అని భావించిన పెళ్ళి బృందం అద్దెకు తీసుకున్న ఇంద్ర బస్సులో పొదిలి నుంచి కాకినాడకు పెళ్ళి వేడుకకు వెళ్తున్న సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఆ సమయంలో బస్సులో మొత్తం 37 మంది ప్రయాణికులు ఉన్నారు. ఏడుగురు మృతిచెందారు. 30 మందికి గాయాలయ్యాయి. ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి ఇంద్ర బస్సు అదుపు తప్పి సాగర్ కాలువలో పడడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. కాలువలో నీరు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది.

సమస్యల పరిష్కారం పేరుతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష పథకం నిర్వహిస్తోంది. నెల రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ప్రభుతం ప్రకటించింది. జగనన్న సురక్ష కార్యక్రమంలో లబ్ధిదారులు వివిధ రకాల సర్టిఫికెట్లు అందజేస్తున్నారు. ప్రజలకు చేరువ అయేందుకు అధికార పార్టీ నేతలు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వార్డుల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. సచివాలయాల వద్ద ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నారు. ఈ శిబిరాల్లో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్నారు.

# సమస్యల పరిష్కారానికే 'గడప గడపకూ' : మంత్రి

**ప్రజాశక్తి-త్రిపురాంతకం**

క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తెలిపారు. మండల పరిధిలోని లేళ్లపల్లి గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్ర మం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గడప గడపకూ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. అదేవిధంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా అందజేస్తున్నట్లు తలెఇపారు. ప్రజల సమస్యలను 24 గంటల్లో పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హులందరికీ న్యాయం చేయాలన్న ఉద్దేశంతో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలలన్నారు. నియోజకవర్గ అభివద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించి దాని ప్రకారం పని చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కోట్ల సుబ్బారెడ్డి, జడ్‌పిటిసి మాకం జాన్‌పాల్, వైస్ ఎంపిపి ఆళ్ల ఆంజనేయరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ సింగారెడ్డి పోలిరెడ్డి, తహశీల్దారు కిరణ్, వైసిపి నాయకులు, అధికారులు, వాలంటీర్లు పాల్గొన్నారు. **జరుగుమల్లి :** పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి పాలన సాగిస్తున్నట్లు వైసిపి కొండపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు తెలిపారు. మండల పరిధిలోని చింతలపాలెం గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు గడప గడపకూ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బెల్లం నిర్మల, మాజీ ఎంపిపి బెల్లం సత్యనారాయణ, పల్లా అనూరాధ, బద్దిపూడి సురేష్, దుంపా అనిల్ కుమార్‌రెడ్డి, జరుగుమల్లి సర్పంచి కసుకుర్తి పున్నారావు, చింతలపాలెం సర్పంచి వేల్పుల హరిబాబు, నాయకులు నల్లూరి సురేంద్ర, బద్రి, కొమ్మాలపాటి మధు పాల్గొన్నారు.



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సురేష్